www.akshratimes.com

తెలుగు దినపత్రిక

# అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

RNI.NO : APTEL/2022/90211

సంపుటి : 03 సంచిక : 365 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com మంగళవారం 14 - 04 - 2026

Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Guntur,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool



ఒకే ఛార్జ్‌పై 320 కి.మీ. రేంజ్.. ఓలా నుంచి కొత్త మోడల్ స్కూటర్ విడుదల!

## పారిశ్రామిక విధానంలో

# ఏపీ దూకుడు

- ఆశ్చర్యపోయిన కేంద్ర ఉక్కు శాఖ కార్యదర్శి
- పరిశ్రమల ఏర్పాటులో నిబంధనల సరళీకరణపై సీఎం చంద్రబాబు సమీక్ష
- 800కు పైగా ఉన్న రూల్స్‌ను 100 లోపునకు తగ్గించాలని అధికారులకు ఆదేశం
- మే నెలాఖరులోగా డీ-రెగ్యులేషన్ ఫేజ్-2 అమలుకు ఆర్డినెన్స్ జారీకి సూచన
- 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానమే తమ లక్ష్యమని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి
- డీ-రెగ్యులేషన్ ఫేజ్-3లో ఏఐ, టెక్నాలజీ వినియోగించాలని కేంద్రానికి సీఎం సూచన



**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతికి ఊతమిచ్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పరిశ్రమల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసేందుకు, అనవసర నిబంధనలను తొలగించేందుకు ఉద్దేశించిన కేంద్ర ప్రభుత్వ డీ-రెగ్యులేషన్ ఫేజ్-2 ప్రతిపాదనలపై సోమవారం ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. కేంద్ర ఉక్కు శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులతో చంద్రబాబు సమావేశమయ్యారు. - మిగతా 2 లో




## ఏపీలో పరిశ్రమల ఏర్పాటు మరింత సులభం

- పారిశ్రామిక అనుమతుల సరళీకరణపై కేంద్ర బృందంతో సీఎం చంద్రబాబు సమావేశం
- బ్రిటీష్ కాలం నాటి చట్టాలను తొలగించి, నిబంధనలను సులభతరం చేయాలని ఆదేశం
- మే చివరికల్లా డి-రెగ్యులేషన్ ఫేజ్-2ను పూర్తి చేయాలని అధికారులకు లక్ష్యం


## రాష్ట్రపతి ముర్ముకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి లోకేశ్





- రాష్ట్రపతి ముర్ముకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి లోకేశ్, ఎంపీలు
- ఇటీవల పార్లమెంటు ఉభయ సభల్లో అమరావతి చట్టబద్ధత బిల్లుకు ఆమోదం
- అమరావతి ప్రస్థానంపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను రాష్ట్రపతికి అందజేత
- రైతుల త్యాగాలను, సీఎం చంద్రబాబు నాయకత్వాన్ని రాష్ట్రపతి ప్రశంసించారని లోకేశ్ వెల్లడి

## ఏపీ మంత్రులకు సింగపూర్‌లో ప్రత్యేక శిక్షణ

- సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం
- సుపరిపాలనే లక్ష్యంగా ఏపీ మంత్రులకు సింగపూర్‌లో ప్రత్యేక శిక్షణ
- ఈ నెల 21 నుంచి 27 వరకు జరగనున్న శిక్షణా కార్యక్రమం
- పయ్యావుల, నారాయణ, అచ్చెన్నాయుడు సహా 9 మంది మంత్రుల హాజరు




## మక్కా ప్రవేశంపై సౌదీ ప్రభుత్వం ఆంక్షలు

- కొత్త నిబంధనల అమలు
- ప్రారంభమవుతున్న హజ్ సీజన్
- అధికారిక అనుమతి పత్రాలు లేని విదేశీయులకు ప్రవేశం నిషేధం
- నిబంధనలు ఉల్లంఘించి వచ్చే వారిని వెనక్కి పంపేలా కఠిన చర్యలు

# అశ్రునయనాల మధ్య ఆశా భోంస్లేకు తుది వీడ్కోలు

- ముంబై శివాజీ పార్క్‌లో ఆశా భోంస్లే అంత్యక్రియలు పూర్తి
- ప్రభుత్వ లాంఛనాలతో తుది వీడ్కోలు పలికిన ప్రముఖులు
- పోలీసుల గౌరవ వందనంతో నివాళి
- 92 ఏళ్ల వయసులో బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో కన్నుమూత
- ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘ సంగీత ప్రస్థానం ముగింపు



**ముంబై :**

భారతీయ సినీ సంగీత ప్రపంచంలో ఒక శకం ముగిసింది. దిగ్గజ గాయని, స్వర సామ్రాజ్ఞి ఆశా భోంస్లే (92) పంచభూతాల్లో లీనమయ్యారు. ముంబైలోని శివాజీ పార్క్ శ్మశానవాటికలో సోమవారం సాయంత్రం ఆమె అంత్యక్రియలు పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. సూర్యాస్తమయ వేళ, అశ్రునయనాల మధ్య ఆమెకు తుది వీడ్కోలు పలికారు. కుటుంబ సభ్యులు, రాజకీయ ప్రముఖులు, అభిమానుల సమక్షంలో వేద మంత్రోచ్ఛారణలతో తుది సంస్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు గాలిలో మూడు రౌండ్లు కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ బ్యాండ్ సభ్యులు 'లాస్ట్ పోస్ట్' వాయిస్తూ ఆమెకు సైనిక లాంఛనాలతో నివాళి అర్పించారు. అంతకుముందు ఆమె నివాసం నుంచి శివాజీ పార్క్ వరకు భారీ ఊరేగింపుతో అంతిమయాత్ర సాగింది. ఆశా భోంస్లే ఏప్రిల్ 12న ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. గుండెపోటుతో ఆసుపత్రిలో - మిగతా 2 లో

## భారతదేశం సరికొత్త చరిత్రను లిఖించనుంది

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- 21వ శతాబ్దంలోనే అతిపెద్ద నిర్ణయాల్లో ఒకదానిని భారత్ తీసుకోబోతోందన్న మోదీ
- భారత ప్రజాస్వామ్యాన్ని మహిళలు బలోపేతం చేస్తారన్న మోదీ
- సుదీర్ఘ కాలం తర్వాత ఈ బిల్లు వస్తోందన్న మోదీ



**ఢిల్లీ :**

చట్టసభల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు త్వరలో చట్టం కానుందని, తద్వారా భారతదేశం సరికొత్త చరిత్రను లిఖించనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ 21వ శతాబ్దంలోనే అతిపెద్ద నిర్ణయాల్లో ఒకదానిని భారత్ - మిగతా 2 లో

## ఈ ప్రభుత్వం రైతుల కోసమా.. దళారుల కోసమా?

- కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ రావు నిప్పులు
- సదాశివపేటలోని శనగల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన హరీశ్ రావు
- రైతులు పంటను మద్దతు ధరకు అమ్ముకోలేకపోతున్నారని ఆవేదన




## రేవంత్ రెడ్డి ప్రతిపాదనలు రాజ్యాంగ విరుద్ధం




- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్
- ఆదాయం ప్రాతిపదికన సీట్ల విభజన జరగాలన్న రేవంత్ రెడ్డి
- హైదరాబాద్‌కే అన్ని సీట్లు ఇవ్వాలా? అని ప్రశ్నించిన బండి సంజయ్
- రాజ్యాంగ పునాదులను కాంగ్రెస్ బలహీనపరుస్తోందని విమర్శ

# డీలిమిటేషన్‌పై అన్ని రాష్ట్రాల సీఎంలకు లేఖలు రాస్తా

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మహిళా రిజర్వేషన్ల పేరుతో లోక్‌సభ సీట్లు పెంచాలని బీజేపీ చూస్తోందన్న రేవంత్ రెడ్డి
- మహిళా బిల్లుకు ప్రతి ఒక్కరు మద్దతిస్తారని రేవంత్ రెడ్డి స్పష్టం
- జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్ల పెంచేలా బీజేపీ యత్నిస్తోందని ట్వీట్
- లోక్ సభ సీట్ల పెంపుపై అఖిలపక్ష భేటీలో చర్చించాలని సూచన
- మహిళా రిజర్వేషన్ల పేరిట జనాభా ఆధారంగా లోక్ సభ సీట్లు పెంచాలని చూస్తున్నారని ఆరోపణ



**హైదరాబాద్ :**

మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన అనేవి దేశ ప్రజలందరికీ సంబంధించిన అంశాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కానీ, బీజేపీ మాత్రం తమ సొంత వ్యవహారం అన్నట్లుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌ను కలిపి తీసుకురావడం, పాత జనాభా లెక్కల ప్రకారం వెళ్లడం వెనుక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. ఎన్డీయే - మిగతా 2 లో

# సంపాదకీయం

## ప్రమాదపుటంచుల్లో దేశాలు



ఇజ్రాయెల్‌తో కలిసి ఏకపక్షంగా ఇరాన్‌పై యుద్ధం ప్రారంభించింది మొదలు అది ఇవాళో, రేపో పూర్తికాబోతున్నదని చెప్పడం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు అలవాటైపోయింది. తాజాగా ప్రకటించిన సోమవారం డెడ్‌లైన్ కూడా ఆ ప్రస్తావనే లేకుండా ముగిసిపోయింది. కావలసినట్టుగా కథనాలను వండివార్చిపెట్టే ఒక వార్తాసంస్థ ద్వారా మాత్రం అమెరికా, ఇరాన్‌లు పాకిస్తాన్ మధ్యవర్తిత్వంతో 'ఇస్లామాబాద్ ఒడంబడిక' కుదుర్చుకున్నాయనీ, రెండంచెల ఈ పథకంలో తక్షణ కాల్పుల విరమణ, అనంతరం కుదరబోయే సమగ్ర ఒప్పందం భాగమనీ సోమవారం లీక్ వదిలారు. కాల్పుల విరమణ 45 రోజులపాటు అమల్లో ఉంటుందని కూడా ఆ కథనం చెబుతోంది. కానీ 38వ రోజుకూడా యథావిధిగా దాడులు జరిగి, ఇరాన్‌కు చెందిన ఒక సహజవాయు క్షేత్రం ధ్వంసమైంది. అమెరికా, ఇజ్రాయెల్ నౌకలపై ఇరాన్ దాడులు చేసింది. ఇక ఇరాన్‌లోని సమస్త మౌలిక సదుపాయాలనూ మంగళవారం ధ్వంసం చేయబోతున్నానని ట్రంప్ ప్రకటించినా అటునుంచి రాజీ స్వరం వినబడలేదు. పైపెచ్చు ఆయన వ్యాఖ్యలు తూగుతప్పిన మాటలని ఇరాన్ ప్రతిస్పందించింది. 'మీ ప్రతిపాదనను పరిశీలించటానికి తగిన సమయం తీసుకుంటాం. ఈలోగా ఏ ఒత్తిడికీ లొంగేది లేదు. హోర్ముజ్‌ను తెరిచేదిలేద' ని కటువుగా సమాధానమిచ్చింది. నిఘా సంస్థలూ, రక్షణ దళాల ముఖ్యులూ హెచ్చరిస్తున్నా యుద్ధానికి కాలుదువ్విన ట్రంప్ దాన్నుంచి బయటపడే మార్గం కోసం తెగ తాపత్రయపడుతున్నారు. ఏ విధంగా చూసినా బలాబలాల విషయంలో తమతో సరిపోలని ఇరాన్ వంటి ఒక చిన్న దేశాన్ని పోరాడక తప్పని స్థితిలోకి నెట్టడం ద్వారా ప్రచార యుద్ధంలో దానిదే పైచేయి అయ్యేలా చూసిన ఘనత ట్రంప్‌కే దక్కుతుంది. సమవుజ్జీలు కాని ఇద్దరి మధ్య పోరు జరుగు తున్నప్పుడు సహజంగా బలహీనుడికే సహానుభూతి దక్కుతుందన్న ఇంగిత జ్ఞానం ఆయన మరిచారు. విద్యుదుత్పాదన ప్లాంట్లు, రోడ్లు, వంతెనలు, నిర్లవణీకరణ ప్లాంట్లు మంగళవారం ధ్వంసం చేస్తామనటం అంటే యుద్ధనేరాలకు పాల్పడతానని చెప్పడమే! అమెరికా అధ్యక్షుడొకరు ఇలా బాహాటంగా ప్రకటించటం మునుపెన్నడూ లేదు. యుద్ధంవల్ల పౌరజీవితాలకు నష్టం వాటిల్లకూడదని, వారి ప్రాణాలకు ముప్పు రాకూడదని జెనీవా ఒప్పందాలూ, హేగ్ ఒడంబడికలూ, న్యూరెంబర్గ్ నియమాలూ, ఐక్యరాజ్యసమితి అధికారిక పత్రమూ ఘోషిస్తున్నాయి. ట్రంప్ వర్తమాన స్థితి నియంత్రణ లేని ట్రెడ్‌మిల్ ఎక్కిన మనిషిని పోలి ఉంది. అది నిరంతరాయంగా తిరుగుతూనే ఉంటుంది, దిగటానికి ప్రయత్నిస్తే బొక్కబోర్లాపడే ప్రమాదం ఉంటుంది. యూదు జాతీయుడైన ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నెర్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ కుమ్మక్కై ఇరాన్ రెండ్రోజులకే పాదాక్రాంతమవుతుందని ట్రంప్‌ను నమ్మించిన పర్యవసానమే ఈ యుద్ధమని 'మాగా' శిబిరంలో అందరికీ తెలుసు. అమె రికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మొదలుకొని 'మాగా' సిద్ధాంతవేత్త స్టీవ్ బేనన్ వరకూ అందరిలోనూ వైట్‌హౌస్‌ను 'ఇజ్రాయెల్ లాబీ' శాసిస్తోందన్న ఆగ్రహావేశాలున్నాయి. ట్రంప్ బలమైన మద్దతుదారు చార్లీ కిర్క్ హత్య ఇలాంటి గొడవల పర్యవసానమేనని వదంతులున్నాయి. దానిపై దర్యాప్తు సాగుతున్న తరుణంలోనే మరో 'మాగా' మద్దతు దారు, జాతీయ ఉగ్రవాద వ్యతిరేక కేంద్రం డైరెక్టర్ జో కెంట్ నిష్క్రమించాల్సి వచ్చింది. దిక్కుతోచని స్థితిలో పడినందువల్లే యుద్ధంలో పాలుపంచుకోవాలంటూ యూరప్ దేశాలపై ట్రంప్ ఒత్తిళ్లు తెచ్చారు. అవి ఫలించకపోవటంతో శాపనార్థాలు పెట్టారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఒక్క 70వ దశకంలో తప్ప ప్రపంచానికెప్పుడూ ఈ స్థాయిలో 'ఆయిల్ షాక్' తగల్లేదు. అసలే ఆర్థిక వ్యవస్థలు కష్టాల్లో ఉన్నాయి. అప్పుడప్పుడు మాత్రమే లోటు బడ్జెట్లుండే కాలం గతించి, అవి రివాజుగా మారిన ఈ వర్తమానంలో 'పులి మీద పుట్ర'లా ట్రంప్ తీసుకొచ్చిన ఈ యుద్ధంతో... ఇజ్రాయెల్, అమెరికాలను గుడ్డిగా సమర్థించే దేశాలు సైతం కష్టాల్లో కూరుకుపోయాయి. సగటు లోటు జీడీపీలో 2 శాతం మించని దేశాల్లో ఇప్పుడది 20 శాతానికి ఎగబాకే ముప్పు ముంచుకొస్తోంది. ఈ దశలో కూడా ట్రంప్ కళ్లు తెరవకపోతే ప్రపంచం మరింత సంక్షోభంలో పడుతుంది.

## ఏపీ మంత్రులకు సింగపూర్‌లో ప్రత్యేక శిక్షణ

**మొదటిపేజీ తరువాయి –** ఏపీలో ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా రాష్ట్ర మంత్రివర్గంలోని తొమ్మిది మంది మంత్రులకు సింగపూర్‌లో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు వారం రోజుల పాటు ఈ శిక్షణ జరగనుంది. సుపరిపాలన, ఆధునిక పరిపాలన పద్ధతులు, ఆర్థికాభివృద్ధికి అవసరమైన నైపుణ్యాలపై మంత్రులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఈ ఉన్నత స్థాయి శిక్షణ కోసం మంత్రులు పయ్యావుల కేశవ్, పొంగూరు నారాయణ, కింజరాపు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, బీసీ జనార్ధన్ రెడ్డి, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు సింగపూర్‌కు వెళ్లనున్నారు. తమ శాఖలకు సంబంధించిన ప్రపంచ స్థాయి విధానాలను అధ్యయనం చేసి, వాటిని ఏపీలో అమలు చేసే అవకాశాలను వీరు పరిశీలించనున్నారు. ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్, పెట్టుబడుల ఆకర్షణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో సింగపూర్ అనుసరిస్తున్న విజయవంతమైన నమూనాలపై దృష్టి సారించనున్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ పరిపాలనా వ్యవస్థల్లో సింగపూర్ ఒకటిగా గుర్తింపు పొందింది. అవినీతిరహిత పాలన, పారదర్శకత, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వ సేవల్లో విస్తృతంగా ఉపయోగించడం వంటి అంశాల్లో సింగపూర్ ఒక రోల్ మోడల్‌గా నిలుస్తోంది. ఈ కారణాలతోనే ఏపీ ప్రభుత్వం తమ మంత్రుల శిక్షణ కోసం సింగపూర్‌ను ఎంపిక చేసింది. ఈ శిక్షణ ద్వారా మంత్రులు నేర్చుకున్న అనుభవం, పరిజ్ఞానం రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని, ప్రభుత్వ సేవల్లో నాణ్యత పెరిగి ప్రజలకు మెరుగైన పాలన అందుతుందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. సీఎం చంద్రబాబు నాయుడు సుపరిపాలన దిశగా తీసుకున్న మరో ముఖ్యమైన ముందడుగుగా దీనిని విశ్లేషిస్తున్నారు.

## అశ్రునయనాల మధ్య ఆశా భోంస్లేకు తుది వీడ్కోలు

**మొదటిపేజీ తరువాయి –** చేరినట్లు తొలుత వార్తలు వచ్చినా, ఛాతీ ఇన్ఫెక్షన్, తీవ్రమైన అలసట కారణంగా ఆమె మరణించినట్లు మనవరాలు జానై భోంస్లే వెల్లడించారు. పదేళ్ల వయసులోనే మరాఠీ చిత్రంతో గాయనిగా ప్రస్థానం ప్రారంభించిన ఆశా భోంస్లే, ఎనిమిది దశాబ్దాలకు పైగా తన గానంతో శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. 'ఉమ్రావ్ జాన్', 'తీస్రీ మంజిల్', 'రంగీలా' వంటి చిత్రాల్లో ఆమె పాడిన ఎన్నో గీతాలు అజరామరంగా నిలిచిపోయాయి. ఇటీవల దుబాయ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో 'తౌబా తౌబా' పాటకు ఉత్సాహంగా డ్యాన్స్ చేసిన వీడియో వైరల్ అయింది. ఆమె మరణంతో భారతీయ సంగీతంలో ఓ సువర్ణాధ్యాయం ముగిసినట్లయింది.

## భారతదేశం సరికొత్త చరిత్రను లిఖించనుంది

**మొదటిపేజీ తరువాయి –** తీసుకోబోతుందని వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఉద్దేశించి నేడు ఢిల్లీలో నిర్వహించిన 'నారీ శక్తి వందన్ సమ్మేళన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత ప్రజాస్వామ్యాన్ని మహిళలు మరింత బలోపేతం చేస్తారని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అత్యంత అవసరమని మోదీ అన్నారు. సుదీర్ఘ కాలం తర్వాత ఈ బిల్లు వస్తోందని తెలిపారు. ప్రతి పార్టీ దీనిని ముందుకు తీసుకువెళ్లాలని అన్నారు. 2029లోగా మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని వ్యాఖ్యానించారు. మహిళల నేతృత్వంలో అభివృద్ధి వేగవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మక్కా ప్రవేశంపై సౌదీ ప్రభుత్వం ఆంక్షలు

**మొదటిపేజీ తరువాయి –** హజ్ యాత్ర సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో సౌదీ అరేబియా ప్రభుత్వం మక్కా నగర ప్రవేశంపై కీలక ఆంక్షలు విధించింది. ఈరోజు నుండి అధికారిక అనుమతి పత్రాలు లేని విదేశీయులు, స్థానిక నివాసితులు ఎవరూ మక్కాలోకి ప్రవేశించకూడదని స్పష్టం చేసింది. యాత్రికుల రద్దీని క్రమబద్ధీకరించడం, భద్రతను పర్యవేక్షించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సౌదీ ప్రెస్ ఏజెన్సీ వెల్లడించింది. కేవలం మక్కాలో పని చేసే వర్క్ పర్మిట్ ఉన్నవారు, అక్కడ జారీ చేసిన రెసిడెన్సీ ఐడీ (ఇఖామా) కలిగిన వారు లేదా చెల్లుబాటు అయ్యే హజ్ పర్మిట్ ఉన్నవారిని మాత్రమే నగరంలోకి అనుమతిస్తారు. నిబంధనలను ఉల్లంఘించి వచ్చే వారిని సరిహద్దు తనిఖీ కేంద్రాల వద్దే నిలిపివేసి వెనక్కి పంపేలా కఠిన చర్యలు చేపట్టారు. మరోవైపు ఉమ్రా వీసాలపై వచ్చిన విదేశీయులకు ఏప్రిల్ 18 వరకు మాత్రమే గడువు విధించారు. ఈ లోపు వారు దేశం విడిచి వెళ్లాల్సి ఉంటుంది. అలాగే ఏప్రిల్ 18 నుండి మే 31 వరకు 'నుసుక్' ప్లాట్‌ఫారమ్ ద్వారా పౌరులు మరియు జీసీసీ దేశాల వారికి ఇచ్చే ఉమ్రా పర్మిట్ల జారీని పూర్తిగా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఏప్రిల్ 18 తర్వాత కేవలం హజ్ వీసా ఉన్న వారిని మాత్రమే మక్కాలోకి అనుమతించనున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలతో పాటు కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని సౌదీ ప్రభుత్వం హెచ్చరించింది. పవిత్ర హజ్ యాత్రను ప్రశాంతంగా, క్రమశిక్షణతో నిర్వహించేందుకు యాత్రికులందరూ సహకరించాలని కోరింది.

# పారిశ్రామిక విధానంలో ఏపీ దూకుడు

**మొదటిపేజీ తరువాయి –** ఈ సందర్భంగా, పారిశ్రామిక అనుమతుల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ పలు ఆదేశాలు జారీ చేశారు.

**ఏపీ స్పీడ్ బాగుంది!**

రాష్ట్ర ప్రభుత్వ వేగాన్ని, ఆలోచనా విధానాన్ని చూసి కేంద్ర ఉక్కు శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తాము ప్రతిపాదించిన దానికంటే రాష్ట్రం ఎంతో ముందుందని ప్రశంసించారు.

డీ-రెగ్యులేషన్ ఫేజ్-3ని ఎప్పుడు ప్రారంభిస్తారని సీఎం ఆరా తీయగా, జూన్ నుంచి దానిపై కసరత్తు చేస్తామని సందీప్ పౌండ్రిక్ తెలిపారు. ఫేజ్-3లో టెక్నాలజీ అనుసంధానం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్స్ వినియోగానికి పెద్దపీట వేయాలని చంద్రబాబు సూచించారు. తాము ఇప్పటికే డేటా లేక్, రియల్ టైం డేటా, సీఎఫ్ఎంఎస్, అవేర్-2.0, వాట్సాప్ గవర్నెన్స్ వంటి అధునాతన వ్యవస్థలను వినియోగిస్తున్నామని కేంద్ర బృందానికి వివరించారు.

**800 నిబంధనలు ఇక 100కి కుదింపు**



ప్రస్తుతం పరిశ్రమల ఏర్పాటుకు అడ్డంకిగా ఉన్న 800కు పైగా నిబంధనలను కేవలం 100 లోపునకు కుదించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, పర్మిషన్లు, లైసెన్సుల సంఖ్యను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయాలని స్పష్టం చేశారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే అది జీవితకాలం చెల్లుబాటు అయ్యేలా చూడాలని, డబుల్ లైసెన్సింగ్ వంటి పద్ధతులను పూర్తిగా తొలగించాలని సూచించారు. ఈ సంస్కరణలన్నింటినీ మే నెలాఖరులోగా అమల్లోకి తెచ్చేందుకు వీలుగా అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకురావాలని ఆదేశించారు. దరఖాస్తు స్వీకరణ నుంచి అనుమతుల జారీ వరకు మొత్తం ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్ చేయాలని, తద్వారా పారదర్శకతను పెంచాలని నిర్దేశించారు. ఈ మార్పుల వల్ల పరిశ్రమల ఏర్పాటుకు పట్టే సమయంలో 40 శాతం ఆదా కావాలని లక్ష్యంగా నిర్దేశించారు. అయితే, నిబంధనల సరళీకరణ పేరుతో ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక అంశాల్లో రాజీ పడకూడదని చంద్రబాబు స్పష్టం చేశారు. వేధింపులకు ఆస్కారం లేని విధంగా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ విషయంలో నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నిబంధనలు రూపొందించాలని ఆదేశించారు. అటవీ చట్టాలను కూడా వీలైనంత సరళీకృతం చేయాలని కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, తమ ప్రభుత్వం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి ఒక అడుగు ముందుకేసి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అదే రీతిలో, ప్రజలకు ప్రభుత్వ సేవలను వేగంగా అందించేందుకు 'స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్'ను పాటిస్తున్నామని వివరించారు.

# రాష్ట్రపతి ముర్ముకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి లోకేశ్

**మొదటిపేజీ తరువాయి -** ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజముద్ర వేయడం చరిత్రాత్మకమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షను నెరవేర్చిన రాష్ట్రపతికి కృతజ్ఞతలు తెలిపేందుకు, మంత్రి లోకేశ్ నేతృత్వంలోని ఎన్డీఏ ఎంపీల బృందం సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ చారిత్రక నిర్ణయంతో "మా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్-మా రాజధాని అమరావతి" అని ప్రతి ఆంధ్రుడు గర్వంగా చెప్పుకునేలా చేశారని వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన తర్వాత రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ తీవ్రంగా నష్టపోయిందని రాష్ట్రపతికి వివరించారు. ఐదు కోట్ల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రూపుదిద్దుకున్న అమరావతికి చట్టబద్ధత కల్పించడంపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. అమరావతికి శంకుస్థాపన చేసింది ప్రధాని నరేంద్ర మోదీయేనని, 2024లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయన నాయకత్వంలోనే పనులు తిరిగి ప్రారంభమ య్యాయని గుర్తుచేశారు. అనంతరం, అమరావతి చరిత్ర, సంస్కృతి, రైతుల ఉద్యమం, మాస్టర్ ప్లాన్, పర్యావరణ హిత నిర్మాణాల విశేషాలతో కూడిన పుస్తకాన్ని రాష్ట్రపతికి అందజేశారు.

**రైతుల త్యాగఫలం అమరావతి**

రాజధాని నిర్మాణం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుతో రైతులు కేవలం 58 రోజుల్లో 34 వేల ఎకరాల భూములను స్వచ్ఛందంగా త్యాగం చేశారని లోకేష్ రాష్ట్రపతికి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో వారిపై దాడులు జరిగినా, అక్రమ కేసులు బనాయించినా వెనకడుగు వేయకుండా శాంతియుతంగా ఉద్యమం కొనసాగించారని వివరించారు.

**పోరాడితేనే చిరస్థాయిగా నిలుస్తుంది: రాష్ట్రపతి**

మంత్రి లోకేశ్, ఎంపీల బృందం చెప్పిన విషయాలను సావధానంగా విన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, అమరావతి చట్టం తన హయాంలో రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంపై ప్రేమతో రైతులు తమ భూములను త్యాగం చేయడాన్ని ఆమె ప్రశంసించారు. "పోరాడి సాధించుకున్నది చిరస్థాయిగా గుర్తుండిపోతుంది" అని ఆమె వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక విజనరీ లీడర్ అని, ఆయన దూరదృష్టితో రాష్ట్రాన్ని, రాజధానిని అద్భుతంగా అభివృద్ధి చేస్తారన్న విశ్వాసం తనకుందని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో పయనించాలని, రాజధాని నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు.

# ఏపీలో పరిశ్రమల ఏర్పాటు మరింత సులభం

**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి ఊతమిచ్చేందుకు, పెట్టుబడులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. పరిశ్రమల ఏర్పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు, నిబంధనలను సులభతరం చేసేందుకు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. బ్రిటీష్ కాలం నాటి పాత చట్టాలను తొలగించి, వ్యాపారవేత్తలకు అనుకూల వాతావరణం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఆర్డినెన్స్‌లు జారీ చేసి అయినా సరే, సంస్కరణలను వేగంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డి-రెగ్యులేషన్ ఫేజ్-2 కార్యక్రమంపై చర్చించేందుకు కేంద్ర ఉక్కు శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని బృందం సోమవారం అమరావతిలో ముఖ్యమంత్రితో భేటీ అయింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం, రాష్ట్రంలో డి-రెగ్యులేషన్ ఫేజ్-2 అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో విస్తృతంగా చర్చించింది. పరిశ్రమల ఏర్పాటులో వేగాన్ని పెంచడం, అనుమతులను సులభతరం చేయడం, అనవసర నిబంధనలను తొలగించడంపై ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించారు. కేంద్రం రూపొందించిన ప్రతిపాదనలను సందీప్ పౌండ్రిక్ సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న విధానాలను, భవిష్యత్ ప్రణాళికలను ఆయా శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-1లో భాగంగా 7 శాఖల్లో 23 ప్రాధాన్యత అంశాలను పూర్తి చేశామని, ఫేజ్-2లో 28 అంశాలను లక్ష్యంగా నిర్దేశించుకున్నామని అధికారులు వివరించారు. మొత్తం 47 సిఫార్సుల్లో ఇప్పటివరకు 18 అమలు కాగా, మే 31 నాటికి పూర్తి లక్ష్యాన్ని చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసే ప్రక్రియలో ఉన్న జాప్యాన్ని, క్లిష్టతను పూర్తిగా తొలగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బ్రిటీష్ కాలం నాటి పాత చట్టాలను రద్దు చేయడమే లక్ష్యంగా పనిచే యాలని సూచించారు. ప్రస్తుతం 800కు పైగా ఉన్న నిబంధనలను 100 లోపునకు, లైసెన్సుల సంఖ్యను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయాలని ఆదేశించారు. అయితే, ప్రజల భద్రత, పర్యావరణ పరి రక్షణ వంటి కీలక అంశాల్లో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు. డబుల్ లైసెన్సింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని సూచిం చారు. వ్యాపార రిజిస్ట్రేషన్లకు జీవితకాల చెల్లుబాటు ఉండేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని అన్నారు. ఫైర్ సేఫ్టీ విషయ ంలో నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్రానికి అనుకూలంగా ఉండే సరళమైన నిబంధనలు అమ లు చేయాలని, ఫేజ్-2 అమలు తర్వాత పరిశ్రమల ఏర్పాటుకు పట్టే సమయం కనీసం 40 శాతం తగ్గాలని నిర్దేశించారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ, 'నేషన్ ఫస్ట్' నినాదంతో పనిచేస్తున్నామని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి "స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" విధానానికి మారామని తెలిపారు. అటవీ చట్టాలను కూడా సరళీకరించాలని కేంద్ర బృందానికి సూచించారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-3లో టెక్నాలజీ, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని చంద్ర బాబు సూచిం చారు. రాష్ట్రంలో ఇప్పటికే డేటా లేక్, రియల్ టైం డేటా, సీఎఫ్ఎంఎస్ వంటి వ్యవస్థలను వినియో గిస్తున్నామని వారికి వివరించారు.

# డీలిమిటేషన్‌పై అన్ని రాష్ట్రాల సీఎంలకు లేఖలు రాస్తా

**మొదటిపేజీ తరువాయి –**

ప్రభుత్వంలో దక్షిణాది రాష్ట్రాలకు ఏ మాత్రం ప్రాధాన్యం దక్కడం లేదని తెలిపారు. 33 % మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తోందని స్పష్టం చేశారు.

**పాత జనాభా లెక్కల ప్రకారం :** మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ రెండింటిని కలిపి ఇప్పుడు తీసుకువస్తున్నారన్న సీఎం 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన అమలు చేయాలని ఎన్డీఏ చూస్తోందని అన్నారు. 2026 జనాభా లెక్కల ప్రాతిపదికన డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లను చేయాలనేది తమ డిమాండ్ అని వెల్లడించారు. ఈ రెండింటిని కలపటం, పాత జనాభా లెక్కల ప్రకారం వెళ్లడంలో కుట్ర ఉందని విమర్శించారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని, మహిళా రిజర్వేషన్లను ఆర్నెళ్లలోనే అమలు చేయాలని కూడా డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు.

**చిన్న రాష్ట్రాలు నష్టపోతాయని :** డీలిమిటేషన్ అనేది చాలా ప్రమాదకర దిశలో వెళ్తోందని రేవంత్ రెడ్డి అన్నారు. చిన్న రాష్ట్రాలు, దక్షిణాదికి అన్యాయం చేసే కుట్రను మోదీ చేస్తున్నారని, కుటుంబ నియంత్రణను దక్షిణాది రాష్ట్రాలు సమర్థంగా అమలు చేశాయని, ఉత్తరాదిలో కుటుంబ నియంత్రణ సరిగా జరగకపోవటంతో జనాభా విపరీతంగా పెరిగిందని ఆరోపించారు. జనాభా అంతరం వల్లనే నియోజకవర్గాల పెంపును కేంద్రం గతంలో వాయిదా వేసిందని, జనాభా ప్రాతిపదికన చేస్తే చిన్న రాష్ట్రాలు నష్టపోతాయని భావించారని పేర్కొన్నారు 2026 వరకు సీట్ల పెంపు వద్దని 2001లో వాజ్‌పేయి సర్కార్ చట్ట సవరణ చేసిందని గుర్తు చేశారు.

**ఆ రాష్ట్రాల్లో సీట్లు భారీగా పెరుగుతాయి :** జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు వద్దని దక్షిణాది రాష్ట్రాలు గట్టిగా చెప్పాయని, దక్షిణాది రాష్ట్రాల వ్యతిరేకత వల్ల మోదీ కొత్త ప్రతిపాదన తీసుకువచ్చారని, ప్రతి రాష్ట్రంలో 50 శాతం సీట్లు పెంచుతామని మోదీ చెప్తున్నారని తెలిపారు. యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో సీట్లు భారీగా పెరగనున్నాయని, ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య లోక్‌సభ సీట్లలో అంతరం భారీగా పెరుగుతుందని అంచనా వేశారు. సీట్ల పెంపు తర్వాత దక్షిణాదిలో లోక్‌సభ సీట్లు 195 అవుతాయని, సీట్ల పెంపు తర్వాత ఉత్తరాదిలో సీట్లు 620కి పెరుగుతాయని, ఉత్తర, దక్షిణాది మధ్య ప్రస్తుతం ఉన్న 210 సీట్ల అంతరం 412కు పెరుగుతుందని వివరించారు. ఎన్డీఏ ప్రభుత్వంలో దక్షిణాది రాష్ట్రాలకు ఏమాత్రం ప్రాధాన్యం దక్కటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని కీలకశాఖల్లో ఏవీ దక్షిణాది రాష్ట్రాలకు ఇవ్వటం లేదని, దక్షిణాది రాష్ట్రాల పట్ల వివక్షను మరింత పెంచేలా బీజేపీ వెళ్తోందని విమర్శించారు. మహిళా బిల్లును అడ్డుపెట్టుకుని డీలిమిటేషన్ చేయొద్దని కోరారు. ప్రస్తుత సీట్ల ప్రకారమే చట్టప్రకారమే మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి పన్నులు కట్టడం, దిల్లీకి వెళ్లి సలాం కొట్టాలి అన్నట్లుగా ఉందని, పన్నులు కట్టాలి, సలాం కొట్టాలి అనే విధానానికి తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. "డీలిమిటేషన్ అన్యాయంపై అన్ని పార్టీలకు లేఖలు రాస్తాం, డీలిమిటేషన్ అన్యాయంపై అన్ని రాష్ట్రాల సీఎంలకు లేఖలు రాస్తాను. మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో ముడి పెట్టొద్దు. సీట్లు పెంచాలనుకుంటే అఖిలపక్షాన్ని పిలిచి మాట్లాడాలి. ఏ ప్రాతిపదికన 50 శాతం సీట్లు పెంచుతారు?. సీట్లు 50 శాతం పెంచాలని మోదికి ఏ దేవుడు చెప్పాడు?. 50 శాతం సీట్లు పెంచితే ఉత్తరాది, దక్షిణాది మధ్య తీవ్ర అంతరం పెంచుతుంది" రేవంత్ రెడ్డి, సీఎం

**2028 వరకు గడువు ఉంది :** హైబ్రిడ్ ప్రాతిపదికన సీట్లు పెంచాలనేది తమ డిమాండ్ సీఎం తెలిపారు. దేశానికి ఆదాయం ఇస్తున్న రాష్ట్రాలను గౌరవించాలని కోరారు. కొత్తగా పెంచే సీట్లలో 50 శాతానికి జీడీపీ ప్రాతిపదికగా తీసుకోవాలని, కొత్తగా పెంచే సీట్లలో 136 సీట్లు జీడీపీ వృద్ధి ఆధారంగా పెంచాలని, కొత్తగా పెంచే సీట్లలో మరో 136 సీట్లను జనాభా ప్రాతిపదికగా పెంచాలని డిమాడ్ చేశారు. చిన్న రాష్ట్రాలకు కూడా న్యాయం జరిగేలా గతంలో సీట్ల కేటాయింపు జరిగిందని, మొదట మహిళా బిల్లు ఆమోదించి తర్వాత డీలిమిటేషన్‌పై చర్చ చేయాలని అన్నారు. డీలిమిటేషన్‌పై శాసనసభల్లోనూ చర్చ జరగాలని, డీలిమిటేషన్‌పై ఒక కమిటీ వేసి ప్రజాసంఘాల అభిప్రాయాలు కూడా సేకరించాలని తెలిపారు. 2026లో జనగణన పూర్తి చేసి సమగ్ర చర్చ తర్వాత సీట్ల పెంపు చేయాలని, నియోజకవర్గాల పెంపునకు 2028 వరకు గడువు ఉందని వివరించారు.

**రెండు వేర్వేరు అంశాలు :** లోక్ సభ సీట్ల పెంపులో దక్షిణాధి రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, జనాభా ప్రాతిపదికన కాకుండా దేశ వృద్ధిలో ఆర్థిక తోడ్పాటు అందిస్తున్న అంశాల ఆధారంగా సీట్ల పెంపు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ మేరకు ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. ప్రస్తుతం కేంద్రం, మహిళా రిజర్వేషన్లతో పాటు సీట్ల పెంపు చేపడుతోందని, ఈ రెండు వేర్వేరు అంశాలని రేవంత్ రెడ్డి అన్నారు.

**భవిష్యత్తులో దేశాన్ని బలహీనం చేస్తుంది :** మహిళా బిల్లుకు ప్రతి ఒక్కరూ మద్దతిస్తారని కానీ లోక్ సభ సీట్ల పెంపు విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయని రేవంత్ అన్నారు. అసెంబ్లీ సీట్లలో మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలుపరిస్తే దేశం మొత్తం ఆమోదిస్తుందని తెలిపారు. మహిళా రిజర్వేషన్లను అడ్డుపెట్టుకొని లోక్ సభ సీట్లను పెంపును జనాభా ప్రాతిపదికన చేపట్టాలని బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ విధానం భవిష్యత్తులో దేశాన్ని బలహీనం చేస్తుందని అన్నారు. జాతీయ ప్రయోజనాలే ఏ పార్టీకైనా ముఖ్యంగా ఉండాలని తెలిపారు.

**సీట్లు పెంచాలని బీజేపీ ప్రయత్నం చేస్తోంది :** దేశాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలు ఎంతో తోడ్పాటునందిస్తున్నాయని, దాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్థిక వృద్ధి ఆధారంగా సీట్ల పెంపు ప్రక్రియ చేపట్టాలని ప్రధాని మోదీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచాలని బీజేపీ ప్రయత్నం చేస్తోందని, దీన్ని బలవంతంగా అందరిపై రుద్దకుండా ఆర్థిక వృద్ధి ఆధారంగా అనే అంశాన్ని అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి పరిశీలించాలని కోరారు.

## రేవంత్ రెడ్డి ప్రతిపాదనలు రాజ్యాంగ విరుద్ధం

**మొదటిపేజీ తరువాయి -** నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఖండించారు. ఆదాయం ప్రాతిపదికన సీట్ల విభజన జరగాలన్న రేవంత్ రెడ్డి వాదనను రాజ్యాంగ విరుద్ధమని కొట్టిపారేశారు. "అత్యధిక ఆదాయం ఇచ్చే ప్రాంతాలకే ఎక్కువ సీట్లు ఇవ్వాలన్నది రేవంత్ రెడ్డి వాదన. అదే నిజమైతే హైదరాబాద్‌కే అన్ని సీట్లూ ఇవ్వాలా? వెనుకబడిన పాలమూరు, ఆదిలాబాద్ వంటి జిల్లాల పరిస్థితి ఏమిటి?" అని సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ హైకమాండ్‌కు నిధులు పంపి, ఇప్పుడు డబ్బు చుట్టూనే సిద్ధాంతాలు అల్లుతున్నారా? అని ఎద్దేవా చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ పునాదులను కాంగ్రెస్ బలహీనపరుస్తోందని విమర్శించారు. అంబేద్కర్ జయంతికి ముందే ఆయన ఆశయాలను కించపరిచేలా ముఖ్యమంత్రి మాట్లాడటం బాధాకరమని, అంబేద్కర్ బతికుంటే కాంగ్రెస్‌ను దేశం నుంచి బహిష్కరించేవారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకమని విమర్శించారు. గత 50 ఏళ్లలో 33 శాతం రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించిన ఆయన, గతంలో పార్లమెంట్‌లో బిల్లు కాపీలు చించివేసిన ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీలతో కాంగ్రెస్ పొత్తులు పెట్టుకోవడంపై నిలదీశారు. జనాభాతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రంలో 50 శాతం సీట్లు పెంచాలని ప్రధాని మోదీ నిర్ణయించారని, ఇది అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేయడమేనని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ విభజన రాజకీయాలకు నిదర్శనమని, ఇప్పటికైనా రాజ్యాంగ విలువలపై గౌరవంతో మాట్లాడాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.



## ఈ ప్రభుత్వం రైతుల కోసమా.. దళారుల కోసమా?

**మొదటిపేజీ తరువాయి –**

పంట కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందంటూ బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని శనగల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. కోటా పూర్తయ్యిందనే సాకుతో కొనుగోళ్లు నిలిపివేయడంపై అధికారులను నిలదీశారు. కాంగ్రెస్ హయాంలో రైతులు తమ పంటను మద్దతు ధరకు అమ్ముకోలేక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఢిల్లీ, కేరళ పర్యటనల్లో బిజీగా ఉంటూ గాలి మోటార్లలో తిరుగుతున్నారని, వారికి నేల మీద ఉన్న రైతుల బాధలు పట్టడం లేదని విమర్శించారు. సదాశివపేట మార్కెట్‌లో ఇప్పటికే కొన్న శనగలను కూడా, బిల్లులు కావడం లేదనే సాకుతో బస్తాలు ఖాళీ చేసి రైతులకు వెనక్కి ఇచ్చేయడం అత్యంత దారుణమని ఆయన ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన 60 వేల క్వింటాళ్ల శనగలను వెంటనే రూ. 5,870 మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ప్రతి పంటకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు ఆ మాటను 'బోగస్' చేసిందని విమర్శించారు. కనీసం సన్న వడ్లకైనా బోనస్ ఇస్తారో లేదో స్పష్టం చేయాలన్నారు. మొక్కజొన్న, జొన్న, సన్ ఫ్లవర్ కొనుగోలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు పక్క రాష్ట్రాలకు వెళ్లి తక్కువ ధరకే అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు కనీసం 24 గంటల ఉచిత విద్యుత్ కూడా ఇవ్వడం లేదని, కేవలం 10 గంటల కరెంటుతో పంటలు ఎండిపోతున్నాయని విమర్శించారు. "కరెంటు ఇవ్వరు, రైతుబంధు వేయరు, బోనస్ ఇవ్వరు, పండిన పంటను కొనరు. ఈ ప్రభుత్వం రైతుల కోసమా? లేక కాంట్రాక్టర్లు, దళారుల కోసమా?" అని హరీశ్ రావు సూటిగా ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తక్షణమే ఢిల్లీ పర్యటనలు ఆపి, పంట కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్ రావు తదితరులు పాల్గొన్నారు.

# శంఖవరం గ్రామపంచాయతీఆశీలు వేలం నిర్వహించాలి..

**- డిప్యూటీ ఎంపీడీవో వై.నాగలక్ష్మి**



**శంఖవరం,ఏప్రిల్13.అక్షర టైమ్స్:** -కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో మండల కేంద్రమైన శంఖవరం శంఖవరం గ్రామపంచాయతీకి సంబంధించిన డైలీ ఆశీలు వేలంపాట వెంటనే నిర్వహించాలని శంకవరం గ్రామానికి చెందిన మేకల కృష్ణ, రేలంగి దొంగబాబు, పర్వత రామకృష్ణ, బొమ్మిడి చిట్టిబాబు, సూర్యారావు సోమవారం శంఖవరం మండల ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు పిటిషన్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ శంకవరం గ్రామపంచాయతీకి 2026.. 2027 సంవత్సరానికి ఆశీలు వేలంపాట నిర్వహించి పంచాయితీకి ఆదాయం సమకూర్చలని కోరారు. వేలంపాట నిర్వహించకపోవడం వల్ల కొంతమంది వ్యక్తులు అక్రమంగా ఆశీలు వసూలు చేసుకుని జేబులు నింపుకుంటున్నారని అన్నారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి,
కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

## ప్రముఖ గాయని ఆశాభోంస్లే మృతికి సంతాపం తెలిపిన గోకవరం గాయకులు వర సాల ప్రసాద్,ఉంగరాల ఆది విష్ణు



**గోకవరం,ఏప్రిల్13.అక్షర టైమ్స్:-** ఆశాభోంస్లే మృతి సినీ రంగానికి కళారంగానికి తీరని లోటు అని గోకవరం గ్రామానికి చెందిన గాయకులు వరసాల ప్రసాదు ఉంగరాల ఆది విష్ణు అన్నారు. కళకు కులము కాని మతముగాని ప్రాంతం కానీ భాష కానీ అడ్డు రాదని దేశంలో లక్షలాదిమంది అభిమానులను సంపాదించుకున్న ఆశాభోంస్లే జీవితము నిరూపించిందని అన్నారు 1933 సెప్టెంబర్ 8న మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లాలో ఒక గ్రామంలో జన్మించిన ఆశాభోంస్లే చిన్నతనం నుండి గాయని అవ్వాలని పట్టుదలతో కృషిచేసి సినిమా రంగంలో అవకాశాలు దక్కించుకొని బాలీవుడ్లో తిరుగులేని గాయనిగా వేలాది పాటలు పాడి అనేక భాషలలో పాటలు పాడి సినీ నేపథ్య గాయనిగా దేశంలోనే ప్రముఖ గాయనిగా పేరు ప్రఖ్యాతులు పొందారని తెలుగు భాషలో కూడా అనేక పాటలు పాడి దేశవ్యాప్తంగా అనేక భాషలలో అనేక పాటలు పాడి దేశమంతా కూడా తన ప్రతిభా పాటవాలతో శ్రోతలను ఇప్పించినటువంటి మధుర గాయని అమర గాయని ఆశాభోంస్లే అని ఆమె మరణము యావత్ భారత సినీ రంగానికి తీరని లోటని, కళాభిమానులందరికీ బాధాకరమని పేర్కొన్నారు

## టిడిపి మహిళా కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గోకవరం,ఏప్రిల్13.అక్షర టైమ్స్:-** గోకవరం మండలం కృష్ణుని పాలెం గ్రామపంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన టిడిపి మహిళా కార్యకర్త అడ్డాల బాపనమ్మను పరామర్శించిన ఎమ్మెల్యే,టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ. సామాన్య కార్యకర్తనైనా ,పెద్ద నాయకుడినైనా ఒకే విధంగా సమయాన్ని కేటాయించి, వారి యోగక్షేమాల కొరకు అహర్నిశలు శ్రమించే నాయకుడు జ్యోతుల నెహ్రూ అని ఇక్కడ సందర్భం చెప్పకనే చెబుతున్నది. సోమవారం నాడు మహిళా కార్యకర్త బాపనమ్మను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే నెహ్రూ పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.ఇటీవల కాలంలో టిడిపి మహిళా కార్యకర్త అనారోగ్యం కారణంగా రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నదని స్థానిక నాయకులు కన్నబాబు ద్వారా తెలుసుకొని మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి సూపర్డెంట్ కి ఫోన్ చేసి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో జాయిన్ చేసే విధంగా నెహ్రూ ప్రయత్నం చేశారు. మరుసటి రోజున తానే స్వయంగా కార్యకర్తను పరామర్శించి, ఆమెకు ధైర్యం నింపారు. మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ డాక్టర్లకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్, స్థానిక టిడిపి నాయకులు జగ్గంపేట అభివృద్ధి కమిటీ డైరెక్టర్, గోకవరం క్లస్టర్ ఇంచార్జ్ కన్నబాబు,సిద్ధ సురేష్ పాల్గొన్నారు.

## కుషాయిగూడలో రోడ్డు భద్రత దినోత్సవం సందర్భంగా విద్యార్థుల మానవహారం





**కుషాయిగూడ,ఏప్రిల్13.అక్షర టైమ్స్:-**ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యక్రమంలో సోమవారం నిర్వహించిన రోడ్డు భద్రత దినోత్సవం సందర్భంగా కుషాయిగూడలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ శాఖలు సమన్వయంతో రోడ్డు భద్రత చర్యలను అమలు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ర్యాలీలు నిర్వహిం చగా, పోలీసు శాఖ ఆధ్వర్యంలో వాహనదారులు, పాదచారులు భద్రతా నియమాలు పాటించేలా సూచనలు అందించారు. ఇంజనీరింగ్ విభాగం రోడ్లపై గుంతలు పూడ్చడం, పారిశుద్ధ్య విభాగం రోడ్డు పక్కన చెత్త, మట్టి, రాళ్లు లేకుండా శుభ్రత నిర్వహించడం వంటి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. అలాగే విద్యుత్ శాఖ వీధి దీపాల మరమ్మతులు, ట్రాన్స్ఫార్మర్ల భద్రత, విద్యుత్ తీగలు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. డ్రైనేజీ సమస్యలు నివారించేందుకు మాన్ హోల్ మూతలు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖకు సూచనలు ఇచ్చారు.కాప్రా సర్కిల్ ఉప కమిషనర్ శ్రీహరి ఆదేశాల మేరకు కుషాయిగూడ ప్రగతి పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేసి రోడ్డు భద్రతపై ప్రజలకు సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య పర్యవేక్షకుడు సుదర్శన్, ఎస్ఎఫ్ఏ లక్ష్మి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## చిర్యాలలో బ్రహ్మోత్సవ వేడుకల్లో బొంతు దంపతులు



**దమ్మాయిగూడ,ఏప్రిల్13.అక్షర టైమ్స్:-** దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని చిర్యాల గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు, మాజీ కీసర మండల ఎంపీపీ మల్లారపు లక్ష్మీనారాయణ ఆహ్వానం మేరకు చేవెళ్ల పార్లమెంట్ ఇంచార్జ్, నగర మాజీ మేయర్ బొంతు రాంమోహన్, బొంతు శ్రీదేవి యాదవ్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన బొంతు దంపతులు ప్రజల సుఖశాంతి, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొని ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

## ప్రత్తిపాడులో ఐసిడిఎస్ సిడిపివో పద్మావతి ఆధ్వర్యంలో 8వ పోషణ పక్వాడ



**ప్రత్తిపాడు,ఏప్రిల్13.అక్షర టైమ్స్:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు గ్రామంలో ఐసిడిఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ సిడిపిఓ పద్మావతి ఆధ్వర్యంలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్తిపాడు సెక్టార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు.ఈ సందర్భంగా సిడిపిఓ పద్మావతి మాట్లాడుతూ ఈ నెల 9 నుండి 23 తేదీ వరకూ ఐసిడిఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ పరిధిలో అంగన్వాడి కేంద్రాలలో 15 రోజులు పాటు ఈ పోషణ పక్వాడ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు.5వ రోజు కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు గ్రామంలో అంగన్వాడీ సెంటర్ నందు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ బాలింతలు 6 నెలల నుండి 3 సంవత్సరాల పిల్లల తల్లులకు పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు .అనంతరం బాలింతలకు పోషక పదార్థాలను అందించారు. చిన్నారులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే ప్రక్రియ అంగన్వాడి కేంద్రాల ద్వారానే ప్రారంభమవుతుందని తెలిపారు.చిన్నారులకు 2 సంవత్సరాల వయస్సు వచ్చేసరికి మెదడు 80 శాతం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.తల్లిదండ్రులు తమ పిల్లలను చెడు వ్యసనాలైన ఐస్ క్రీం,చక్కెర వంటి పదార్థాలకు,స్క్రీన్ టీవీ మొబైల్ ఫోన్ వంటి వాటికి దూరంగా ఉంచాలని కోరారు.తమ తమ పిల్లలకు ఇంటి లోపల మరియు బయట ప్రదేశాలలో ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.దీని ద్వారా శారీరక నైపుణ్యాలు మెరుగుపడతాయని సామాజిక భావోద్వేగ వికాసం పెరుగుతుందన్నారు. మంచి పోషకాలు అందించాలని దీని ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని మెదడు అభివృద్ధికి సహాయ పడుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు,సూపర్వైజర్ ఎన్ వరలక్ష్మి,ఎంపీపీ స్కూల్ హెడ్ మాస్టర్ పాపయ్య,ఐసిడిఎస్ టీచర్లు,హెల్పర్లు,పలువురు గర్భిణీలు బాలింతలు,చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## పసుపు దంచాకే పెళ్లి పనులు ప్రారంభం..

### ఇది అనాదిగా వస్తున్న సాంప్రదాయం..



**పొదలకూరు,ఏప్రిల్13. అక్షర టైమ్స్:-** వివాహం అంటే రెండు కుటుంబాల, రెండు వంశాల కలయిక. అలాంటి పవిత్రమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టే మొదటి ఆచారం "పసుపు దంచడం". ఇది తెలుగు సంప్రదాయాల్లో ఎంతో ప్రాముఖ్యత కలిగిన, భావోద్వేగాలకు అద్దం పట్టే ఆచారం.పెళ్లి పనులు మొదలయ్యే ముందు ముహూర్తం నిర్ణయించడం జరుగుతుంది. వధూవరుల జాతకాలను పరిశీలించి, తారాబలం, దినబలం చూసి పురోహితుడు శుభమైన సమయాన్ని ఖరారు చేస్తాడు. ఆ శుభదినాన ఇంట్లో ఒక ప్రత్యేకమైన వాతావరణం నెలకొంటుంది. మొదటగా వినాయకుడి పూజతో కార్యక్రమానికి శ్రీకారం చుడతారు. ఎందుకంటే విఘ్నాలను తొలగించే దేవుడు వినాయకుడు. తెల్లని కొత్త వస్త్రంపై బియ్యం పోసి, పసుపుతో గణపతిని తయారు చేసి "ఏ అడ్డంకులు లేకుండా వివాహం జరగాలి" అని ప్రార్థిస్తారు.ఆ తర్వాత అసలు సంబరాలు మొదలవుతాయి. ఇంటి ముత్తైదువులను, బంధుమిత్రులను ఆహ్వానిస్తారు. వారు అందంగా పట్టు చీరలు కట్టుకుని, ఆభరణాలతో అలంకరించి కార్యక్రమానికి హాజరవుతారు. రోలు, రోకళ్లను పసుపు,కుంకుమలతో అలంకరించి, వాటిని పవిత్రంగా తయారు చేస్తారు.పసుపు కొమ్ములను రోట్లో వేసి, అందరూ కలసి దంచడం ప్రారంభిస్తారు. ఆ సమయంలో నవ్వులు, మాటలు, పాటలు కలిసి ఆ ఇంటిని ఆనందంతో నింపేస్తాయి.పసుపు అనేది శుభానికి, ఆరోగ్యానికి, ఐశ్వర్యానికి సంకేతం. అందుకే పెళ్లి కార్యక్రమాల్లో పసుపుకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ దంచిన పసుపునే తర్వాత పెళ్లిలో జరిగే కార్యక్రమాల్లో వధూవరులకు ఉపయోగిస్తారు. ఇది వారి జీవితాలు పసుపు రంగు లాంటి వెలుగులతో నిండాలని సూచిస్తుంది.పసుపు "దంచాకే పెళ్లి పనులు ప్రారంభం" అనే నమ్మకం వెనుక గొప్ప భావం ఉంది. ఈ ఆచారం వధూవరుల జీవితాల్లో ఎలాంటి ప్రతికూలతలు రాకుండా, శుభశకునాలు కలగాలని కోరుతూ చేస్తారు. ఇది ఒక సంప్రదాయం మాత్రమే కాదు.. కుటుంబ సభ్యులందరినీ ఒక్కచోట చేర్చే ఒక ఆనంద క్షణం. ఇటీవల పొదలకూరు మండలం మొగళ్లూరు గ్రామానికి చెందిన ఏపూరు నారాయణ గౌడ్, సుజాత దంపతులు తమ రెండవ కుమారుడు శేఖర్ వివాహ కార్యక్రమాలను ఈ పసుపు దంచే ఆచారంతో ఘనంగా ప్రారంభించారు.కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో ఆనందభరితంగా జరిగిన ఈ కార్యక్రమం, పాత సంప్రదాయాల అందాన్ని మళ్లీ గుర్తు చేసింది.ఇలా పసుపు దంచే చిన్న ఆచారం వెనుక పెద్ద అర్థం ఉంది..అది శుభారంభం..అది కుటుంబ ఆనందం..అది మన సంస్కృతి పరిమళం.

## బిఆర్ఎస్ జెండాను చూస్తే కాంగ్రెస్ నేతలకు వణుకు

### - ఇందారంలో జెండాల తొలగింపుపై అరికె. సంతోష్ యాదవ్ ఆగ్రహం

**మంచిర్యాల,ఏప్రిల్13.అక్షర టైమ్స్:-**జైపూర్ మండలం ఇందారం గ్రామంలో రాజకీయ సెగ రాజుకుంది. ఆదివారం రోజున మంచిర్యాల జిల్లా పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి విచ్చేసిన బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనను పురస్కరించుకొని, జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదేశాల మేరకు ఇందారం బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన జెండాలను, తోరణాలను ఇందారం సర్పంచ్ ఫయాజ్ ఆధ్వర్యంలో తొలగించడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.గులాబీ జెండాను చూస్తేనే కాంగ్రెస్ పెద్దలకు గడగడ వణుకు పుడుతోందని, అందుకే ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నారని బిఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. జెండాలను తరలిస్తున్న ట్రాక్టర్ను బిఆర్ఎస్ నాయకులు అరికె సంతోష్ యాదవ్, మహమ్మద్ అమీర్, గండు సత్యనారాయణ, తుంగపిండి శేఖర్ అడ్డుకొని తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అధికార బలంతో జెండాలను తొలగించడం కాంగ్రెస్ నేతల నీచ రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. అభివృద్ధి పనుల మీద కాకుండా ప్రతిపక్ష పార్టీల జెండాల మీద కక్ష సాధింపులు చేయడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్ళీ పునరావృతమైతే బిఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున ధర్నాకు దిగుతారని, కాంగ్రెస్ నేతలను అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని



కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## ప్రజావాణిలో ప్రజా సమస్యలకు ప్రాధాన్యం



**మల్లాపూర్,ఏప్రిల్13.అక్షర టైమ్స్:-** ఉప్పల్ పరిధిలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల తాగునీటి, డ్రైనేజ్ సమస్యలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్, ఉప ప్రధాన మేనేజర్ వేణుగోపాల్, మల్లాపూర్ సహాయ ఇంజినీర్ రోహిత్‌తో కలిసి కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ ఆయన బృందం పాల్గొన్నారు.ఈ సందర్భంగా బస్తీబాట కార్యక్రమంలో ప్రజలు వ్యక్తపరిచిన సమస్యలను అధికారులు ముందుకు తీసుకెళ్లి, పరిష్కారం కోసం వినతి పత్రాలు సమర్పించారు. ముఖ్యంగా కేఎల్ రెడ్డి, హెచ్బీఎల్ కాలనీ, అన్నపూర్ణ, భవాని నగర్ ప్రాంతాల్లో తక్కువ ఒత్తిడితో తాగునీటి సరఫరా జరుగుతున్న విషయం, ఓల్డ్ మల్లాపూర్‌లో మదీనా చికెన్ సెంటర్ ఎదురుగా కొత్త నీటి పైపుల ఏర్పాటు, అలాగే పలు కాలనీలలో డ్రైనేజ్ లైన్ల అవసరం వంటి సమస్యలు ప్రస్తావించబడ్డాయి.ఈ అంశాలపై స్పందించిన అధికారులు సమస్యలను అత్యవసరంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండే నెమలి అనిల్ కుమార్ కృషిని స్థానికులు అభినందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, కోయలకొండ రాజేష్, శంకర్ గౌడ్, పిడిశెట్టి సురేష్, అన్వర్ పఠాన్, సాయి కుమార్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## రబీ ధాన్యం కొనుగోళ్లకు సన్నాహాలు వేగం



**మేడ్చల్ మల్కాజ్గిరి, ఏప్రిల్13. అక్షర టైమ్స్:** - మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రబీ 2025-26 కాలానికి సంబంధించిన ధాన్యం సేకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు జిల్లా కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల ఇన్చార్జులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభించాలనే నిర్ణయం తీసుకున్నారు. రైతులు తీసుకొచ్చే ధాన్యం నాణ్యత మెరుగ్గా ఉండేలా తడి, దుమ్ము లేకుండా శుభ్రపరిచి బాగా ఆరబెట్టి తీసుకురావాలని అధికారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యాలు లేకుండా ప్రతి నమోదు అదే రోజు పూర్తి చేయాలని, రైతులకు చెల్లింపులు 48 గంటల్లోపు వారి ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టంగా ఆదేశించారు. వరి కోత సమయంలో యంత్రాల యజమానులతో సమన్వయం చేసుకుని ధాన్యం సమయానికి కేంద్రాలకు చేరేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

# రైతుబిడ్డగా అన్నదానం - 19వ విడత సేవా కార్యక్రమం





**మేడ్చల్ మల్కాజ్గిరి,ఏప్రిల్13.అక్షర టైమ్స్:-** అన్నదానమే అన్నిటికంటే గొప్పదని భావిస్తూ రైతు కుటుంబానికి చెందిన వ్యక్తిగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించడం గర్వంగా ఉందని తెలంగాణ రైతు పరిరక్షణ సమితి అధ్యక్షురాలు ఇంద్రపాల భవాని తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్మల్కాజ్గిరి కలెక్టర్ కార్యాలయం వద్ద 19వ విడత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు 18 విడతలుగా విజయవంతంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించామని, తాజాగా జరిగిన 19వ విడతకు విలాసాగరం సుదర్శన్ సహకారం అందించారని పేర్కొన్నారు. ఆయనకు సంస్థ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.ప్రస్తుతం సుమారు 100 మంది వరకు భోజనం అందిస్తున్నామని, భవిష్యత్తులో ఈ సంఖ్యను 150 మందికి పెంచే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. మానవతా దృక్పథంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి దాతలు మరింతగా సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఇంద్రపాల సత్యనారాయణ, దావత్ అరుణ్ కుమార్, అంబాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# పొదలకూరు బాలుర ఉన్నత పాఠశాల లో ముందస్తు గా అంబేద్కర్ జయంతి వేడుకలు..



**పొదలకూరు,ఏప్రిల్13. అక్షర టైమ్స్:-**భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలను ముందస్తుగా పొదలకూరు లోని డి.ఎన్.ఆర్.ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు సి. హెచ్.సురేష్, ఉపాధ్యాయ బృందం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ అంబేద్కర్ కేవలం ఒక వర్గానికి చెందిన వారు మాత్రమే కాదని, ఆధునిక భారతదేశ నిర్మాణంలో ఆయన పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. విద్యార్థులు ఆయన చూపిన చదువు,సంస్కారం , పోరాటం అనే మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొనారు.

# పొదలకూరులో చిన్నారులకు పైనాపిల్స్ పంపిణీ





**పొదలకూరు,ఏప్రిల్13.అక్షర టైమ్స్:-**పొదలకూరు పట్టణంలో వేసవికాలంలో చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని స్థానికంగా పలు సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో పొదలకూరు పట్టణానికి చెందిన యువకుడు తన్నీరు సాయిచంద్ సోమవారం పట్టణంలోని పలువురు చిన్నారులకు పైనాపిల్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం స్థానిక శివాలయం ప్రాంగణంలో జరిగింది.వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా చిన్నారులు అలసట, దాహం, నీరసం వంటి సమస్యలకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో శరీరానికి చల్లదనాన్ని, శక్తిని అందించే పండ్లను తీసుకోవడం ఎంతో అవసరం. పైనాపిల్‌లో విటమిన్ 'సి', యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తి పెరగడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. అలాగే జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా పైనాపిల్ ఉపయోగకరంగా ఉంటుంది.ఈ సందర్భంగా తన్నీరు సాయిచంద్ మాట్లాడుతూ, వేసవిలో చిన్నారులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ఈ పైనాపిల్స్‌ను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కుమారస్వామి, అసిస్టెంట్ చేవూరు కుమార్, అంగన్వాడి టీచర్ అమరావతి తదితరులు పాల్గొన్నారు. చిన్నారులు సంతోషంగా పైనాపిల్స్ స్వీకరించి ఆనందం వ్యక్తం చేశారు.ఈ విధమైన కార్యక్రమాలు సమాజంలో ఆరోగ్యంపై అవగాహన పెంచడంలో తోడ్పడటమే కాకుండా, సేవా భావాన్ని కూడా పెంపొందిస్తున్నాయి.

# కనకదుర్గ గుడి వద్ద చలివేంద్రం ఏర్పాటు



**హైదరాబాద్,ఏప్రిల్13.అక్షర టైమ్స్:-** స్వచ్ఛంద సేవా సంస్థ నవ సేవా సంకల్ప ఆధ్వర్యంలో మణికొండ భాగ్యలక్ష్మి కాలనీలో ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయం వద్ద భక్తుల, పాదచారుల వేసవి దాహార్తి తీర్చడానికి సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ చలివేంద్రాన్ని సంఘ సేవకుడు, సామాజికవేత్త మాదిరెడ్డి పెంటారెడ్డి ప్రారంభించారు. గత మూడు సంవత్సరాలుగా భక్తుల కోసం చలివేంద్రం ఏర్పాటుచేస్తున్నామని నవసేవా సంకల్ప చైర్మన్ మణి చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు తిప్పరాజు రమేష్ బాబు, దేవాలయ సభ్యుడు మల్లారెడ్డి, తానాషా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, సినీ నటుడు శ్రీహరి, సర్దార్ పటేల్ పార్క్ వాక్ మేట్స్ సుగుణ రాజు, రేణికుంట భాస్కర్, విష్ణు, శ్రీనివాసరావు, హర్షా రెడ్డి, అజార్, మహేష్, సుధా రామకృష్ణ, హర్ష కుమార్, రవి, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ స్టేట్ ఒలింపియాడ్‌లో అమరావతి విద్యార్థుల అద్భుత ప్రతిభ..






**పొదలకూరు,ఏప్రిల్13.అక్షర టైమ్స్:-**పొదలకూరులోని అమరావతి స్కూల్ విద్యార్థులు ఇంటర్ స్టేట్ ఒలింపియాడ్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ విశిష్ట విజయాన్ని పురస్కరించుకుని గుంటూరులోని మెడికల్ కాలేజీ వేదికగా విజేత విద్యార్థులను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైమానిక, రక్షణ విభాగ గౌరవ సలహాదారు, మాజీ రక్షణ పరిశోధన సంస్థ చైర్మన్ డాక్టర్ జి. సతీష్ రెడ్డి,లోక్‌సభ సభ్యులు లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కార్ప్స్ డైరెక్టర్ పి. స్రవంతిలు హాజరయ్యారు.ముఖ్య అతిథులు విద్యార్థుల ప్రతిభ, కృషి మరియు పట్టుదల ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగాలోక్‌సభ సభ్యులు లావు కృష్ణదేవరాయలు మాట్లాడుతూ అమరావతి స్కూల్‌లోని విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణ,విద్యార్థుల సాధనను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అమరావతి విద్యాసంస్థ అధినేత కె. సురేష్ , పాఠశాల సిబ్బంది పాల్గొని విజేత విద్యార్థులను అభినందించారు.ఈ విజయం అమరావతి విద్యాసంస్థకు మరింత కీర్తి తీసుకువచ్చి, భవిష్యత్తులో మరిన్ని విజయాలకు నాంది పలుకుతుందని తెలిపారు.

# సోలార్ రూఫ్ టాప్ యూనిట్లతో అందరికీ ఉపయోగం

## ఛార్జీలు తగ్గాలంటే పునరుత్పాదక విద్యుత్తే ప్రత్యామ్నాయం

## రాష్ట్రవ్యాప్తంగా రూ.8 వేల కోట్లతో ఆర్డీఎస్ఎస్ పనులు

## దర్శి నియోజకవర్గంలో పీఎం సూర్యఘర్ అమలుకు రూ.50.39 కోట్లు

## ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్









**ఒంగోలు/దొనకొండ,ఏప్రిల్13. అక్షర టైమ్స్:-** రోజు రోజుకూ పెరుగుతున్న కరెంట్ వాడకం, పెరుగుతున్న విద్యుత్ ఛార్జీలు, ఖర్చులను తగ్గించుకోవడానికి ప్రజలందరూ సోలార్ రూఫ్ టాప్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం, దొనకొండ మండలంలోని మల్లంపేట కాలనీలో మంత్రి గొట్టిపాటి సోమవారం పర్యటించారు. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా గ్రామంలోని 44 ఎస్సీ కుటుంబాలు ఏర్పాటు చేసుకున్న సోలార్ రూఫ్ టాప్ యూనిట్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ల వినియోగాన్ని పెంచుకోవాలని ప్రజలకు సూచించారు. సబ్సిడీతో కూడిన సోలార్ ప్లాంట్ల ఏర్పాటుతో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం ఉంటుందని అన్నారు. మనం వాడుకునే విద్యుత్ ను మన ఇంటిపైనే ఉత్పత్తి చేసుకునే అవకాశం సోలార్ రూఫ్ టాప్ లో ఉందని వివరించారు. ఒక్కో సోలార్ ప్లాంట్ తో సుమారు 300 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చని ఆయన తెలిపారు. దర్శి నియోజకవర్గంలో పీఎం సూర్యఘర్ అమలు కోసం రూ.50.39 కోట్ల నిధులను కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 6 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత సోలార్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సోలార్ కనెక్షన్ తీసుకునే బీసీలకు రూ.98 వేలు, ఓసీలకు రూ.78 వేలు సబ్సిడీ ఇస్తున్నామని ఆయన తెలిపారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై భారాలు వేసిందని మంత్రి గొట్టిపాటి విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు రూపాయి విద్యుత్ ఛార్జీ పెంచకుండానే 13 పైసలు ట్రూ డౌన్ చేసిందన్నారు. రాబోయే కాలంలో విద్యుత్ ఛార్జీలను మరింత తగ్గించే లక్ష్యంతో అనేక చర్యలు చేపడుతున్నామని మంత్రి చెప్పారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పాలుట్ల అటవీ ప్రాంతంలో నివసించే 611 ఎస్టీ కుటుంబాలకు సోలార్, బ్యాటరీ స్టోరేజ్ యూనిట్లను ఉచితంగా అందించామని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. రాష్ట్రంలో విద్యుత్ లేని గ్రామాలు ఉండకూడదన్న సీఎం చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల్లో పాలుట్ల తండా వాసులకు మొదటిసారి విద్యుత్ వెలుగులు అందించడం గొప్ప విషయమన్నారు. తండాలు ఉండే ప్రాంతంలో విద్యుత్ లైన్లు వేయడానికి అటవీ శాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో రాత్రి సమయాల్లోనూ ఉపయోగపడేలా సోలార్, బ్యాటరీ యూనిట్లను వారికి అందించామన్నారు. దేశవ్యాప్తంగా కోటి సోలార్ కనెక్షన్లకు ప్రధాని మోడీ అనుమతులు ఇస్తే, అందులో 20 లక్షలు ఆంధ్రప్రదేశ్ కే కేటాయించారని మంత్రి గొట్టిపాటి గర్వంగా చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.8 వేల కోట్ల ఆర్డీఎస్ఎస్ నిధులతో కొత్త విద్యుత్ లైన్లు, స్తంభాలు ఏర్పాటు, మౌలిక వసతులు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. దర్శి నియోజకవర్గంలో ఆర్డీఎస్ఎస్ పనుల కోసం రూ.147 కోట్లు మంజూరు చేశామని, ఇందులో రూ.115 కోట్లకు సంబంధించిన పనులు కూడా పూర్తయ్యాయన్నారు. పీఎం కుసుమ్ ద్వారా వ్యవసాయానికి పగటి పూటే 9 గంటల సౌర విద్యుత్ ను సరఫరా చేస్తామని మంత్రి గొట్టిపాటి తెలిపారు. పీఎం కుసుమ్ పనులు త్వరలోనే ప్రారభం అవుతాయన్నారు. 11 కేవీ లైన్లకు దగ్గరగా పీఎం కుసుమ్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారు. ప్రభుత్వ భూములు అందుబాటులో లేకపోతే ప్రైవేటు భూములను కౌలుకు తీసుకుని అయినా పీఎం కుసుమ్ సోలార్ ప్లాంట్లను వచ్చే ఏడాదే ప్రారంభిస్తామని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయ కనెక్షన్లను ప్రాధాన్యతా క్రమంలో ఇస్తున్నామని తెలిపారు. పెండింగ్ లో ఉన్న వ్యవసాయ కనెక్షన్లను వ్యవసాయ సీజన్ ప్రారంభం నాటికి ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. లో ఓల్టేజ్, అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా కోసం సబ్ స్టేషన్ల నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధతో వెలిగొండ ప్రాజెక్ట్ కు రూ.500 కోట్లు కేటాయించి పనులు చేయిస్తున్నారని స్పష్టం చేశారు. అదే విధంగా ఆర్థిక వెసులుబాటును బట్టి కొత్త పెన్షన్ల మంజూరుతో పాటు అవసరమైన వారికి ఇళ్లను కూడా కేటాయిస్తామని మంత్రి గొట్టిపాటి భరోసా ఇచ్చారు. అందరికీ సంక్షేమం అమలు చేస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు కూడా గుర్తుంచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, దర్శి నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జ్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారశెట్టి పాపారావుతో పాటు లబ్ధిదారులు, కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

**మల్లంపేట పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి....**

మల్లంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.11 లక్షల వ్యయంతో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ ను ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత వడ్లమూడి భూపాల్ ను అభినందిస్తూ, సీఎం చంద్రబాబు పిలుపు మేరకు పి4 లోభాగంగా ఇటువంటి కార్యక్రమాల నిర్వహణకు అవకాశం ఉన్న మరింత మంది ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక కంప్యూటర్ ల్యాబ్ ల ఏర్పాటుతో ప్రైవేటుకు ధీటుగా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, దర్శి టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారశెట్టి పాపారావు, యువ నాయకులు డా. కడియాల లలిత్ సాగర్ పలువురు పాల్గొన్నారు.

# విదేశాల్లో ఖాతాదారుడు - రూ.6.5 కోట్లు కొట్టేసిన బ్యాంక్ మేనేజర్

**ఎట్టకేలకు అరెస్ట్**

**బ్యాంకు మేనేజర్ వెంకటరమణను అరెస్ట్ చేసిన పోలీసులు**

**కస్టమర్ ఖాతా నుంచి రూ.ఆరున్నర కోట్లు స్వాహా చేసిన నిందితులు**

**బాధితుడు ఆస్ట్రేలియాలో ఉండటంతో కుట్రకు తెరలేపిన అక్రమార్కులు**



నమ్మకానికి నిలువుటద్దంగా ఉండాల్సిన బ్యాంకింగ్ వ్యవస్థలో భారీ లొసుగులు బయటపడ్డాయి. హైదరాబాద్ బేగంపేటలోని యాక్సిస్ బ్యాంక్ ఉన్నతాధికారులే ముఠాగా ఏర్పడి, ఓ ఎన్నారై ఖాతాదారుడి సొమ్ము కాజేశారు. బాధితుడు విదేశాల్లో ఉండటాన్ని ఆసరాగా చేసుకుని, ఫోర్జరీ సంతకాలతో దాదాపు రూ.ఆరున్నర కోట్లు స్వాహా చేశారు. ఈ వ్యవహారంపై యాక్సిస్ బ్యాంక్ మేనేజర్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

**యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ అరెస్ట్ :** ఆస్ట్రేలియాలో నివసిస్తున్న పరితోశ్ ఉపాధ్యాయకు హైదరాబాద్ బేగంపేటలోని యాక్సిస్ బ్యాంక్‌లో 2017 నుంచి ప్రీమియం బ్యాంకు ఖాతా ఉంది. తన ప్రమేయం లేకుండా రూ.ఆరున్నర కోట్లు కాజేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు 2024లో కేసు నమోదు చేశారు. అయితే అప్పటి నుంచి బ్యాంకు అధికారులు తమ పలుకుబడితో అరెస్ట్ కాకుండా ప్రయత్నించారు. తాజాగా యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ వెంకటరమణను అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కస్టమర్ నేరుగా బ్రాంచ్‌కు వస్తే తప్ప ఇవ్వకూడని 42 లూజ్ లీఫ్ చెక్కులను అధికారులు తమకు తామే ఇచ్చుకున్నారు. ఆస్ట్రేలియాలో ఉన్న సమయంలో తన సంతకాలను ఫోర్జరీ చేసి, చెక్కుల ద్వారా నగదు విత్‌డ్రా చేశారని ఖాతాదారు పరితోశ్ ఫిర్యాదు చేశారు. ఇతర ఖాతాలతో పాటు తన తల్లిదండ్రుల అకౌంట్లలోకి తనకు తెలియకుండానే నగదును మళ్లించి అక్రమంగా విత్‌డ్రా చేసుకున్నారని పేర్కొన్నారు.

**యాక్సిస్ లేకుండానే రూ.6.5 కోట్లు లూటీ :** తన ఖాతాలో బ్యాలెన్స్ అసాధారణంగా తగ్గిపోవడాన్ని గమనించిన పరితోశ్, రెండేళ్లుగా న్యాయం కోసం పోరాడుతున్నారు. బ్యాంకు ఉన్నతాధికారుల నుంచి సీఈవో అమితాబ్ చౌదరి వరకు ఈ-మెయిళ్లు పంపినా స్పందించలేదు. విచారణ పేరుతో కాలయాపన చేసిన బ్యాంకు సిబ్బంది, బాధితుడి అనుమతి లేకుండానే ఆయన ఖాతాను క్లోజ్ చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేశారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు భారతీయ న్యాయ సంహిత ప్రకారం నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ వెంకటరమణ జైలులో ఉన్నారు. ఆయనను కస్టడీకి తీసుకుంటే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. బ్యాంక్ అంతర్గత సెక్యూరిటీని ఛేదించి, ఇంతటి భారీ దోపిడీ ఎలా సాధ్యమైంది? ఈ వ్యవస్థీకృత నేరంలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**మోసం జరిగితే ఇలా చేయండి :**

మన కార్డుకు సంబంధించి ఒకవేళ ఏదైనా మోసానికి గురైతే వెంటనే కార్డును బ్లాక్ చేయించాలి.

1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ) వెబ్‌సైట్‌లో ఫిర్యాదును నమోదు చేయాలి.

ఆర్‌బీఐలోని కంప్లైంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌కు నివేదించాలి.

మోసపూరిత లావాదేవీకి సంబంధించిన కాల్ రికార్డింగ్స్, ఈ-మెయిల్ లాంటివి కీలకాధారాలవుతాయి. పోలీసులకిచ్చే ఫిర్యాదులో వీటిని జత చేయాలి.

ఇలా చేస్తే ఆన్‌లైన్ మోసాల గురించి తెలుసుకొని నిఘా ఉంచేందుకు, నియంత్రించేందుకు దోహదపడుతుంది.

# అద్దం లేకపోతే ఏంటి హెల్మెట్ ఉందిగా!

**ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం**

**ముందు అద్దం పగిలిన బస్సులో ప్రయాణానికి ఏర్పాట్లు**

**ప్రమాదానికి గురైన బస్సును చూసి ప్రయాణికుల ఆగ్రహం**

**డ్రైవర్‌ను ప్రశ్నించగా హెల్మెట్ పెట్టుకుని నడుపుతానని సమాధానం**



మార్కాపురంలో మరోసారి, ప్రైవేట్ ట్రావెల్ బస్సు యజమానుల నిర్లక్ష్యం ప్రయాణికుల ప్రాణాలను ప్రమాదంలో పడేసే పరిస్థితులకు దారి తీసింది. 'శ్రీ లక్ష్మీనరసింహ ట్రావెల్స్'కు చెందిన ఒక స్లీపర్ బస్సు మార్కాపురం నుంచి బెంగళూరుకు బయలుదేరాల్సి ఉండగా, 38 మంది ప్రయాణికులు బోర్డింగ్ పాయింట్ వద్ద దాని కోసం వేచి ఉన్నారు. అయితే, వచ్చిన బస్సును చూసి ప్రయాణికులు నివ్వెరపోయారు. బస్సు ముందు విండ్‌షీల్డ్ పూర్తిగా పగిలిపోయినప్పటికీ, దాన్ని ప్రయాణానికి సిద్ధం చేసినట్లు కనిపించింది. ఇంజిన్ ప్రాంతంలోని కొంత భాగం కూడా దెబ్బతిన్నట్లు స్పష్టంగా కనిపించింది.బస్సు పరిస్థితిని గమనించిన ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వారు డ్రైవర్‌ను ప్రశ్నించగా, అతను ఒక విచిత్రమైన సమాధానం చెప్పాడు. తాను హెల్మెట్ ధరించి ప్రయాణికులను గమ్యస్థానానికి చేరవేస్తానని చెప్పాడు. ఈ సమాధానం ప్రయాణికులలో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. బస్సు యజమానులు మనుషుల ప్రాణాలను ఏమాత్రం లెక్క చేయకుండా, నిర్లక్ష్యంతో వ్యవహరిస్తారనే అభిప్రాయాన్ని కలగజేస్తుంది. ఇటువంటి సంఘటనలు ఎదురైనప్పుడు వాటిని మరింత బలపరుస్తాయి.మేము మార్కాపురం నుంచి బెంగళూరుకు బస్సును బుక్ చేసుకున్నాం. కానీ ఆ బస్సు ఫ్రంట్ గ్లాస్ పగిలిపోయింది. ఈ విషయంపై ఓనర్‌కు సమాచారం అందించే ప్రయత్నం చేశాం. కానీ అతని నుంచి ఎటువంటి స్పందన రాలేదు. ఈ విషయంపై డ్రైవర్‌ను ఆరా తీస్తే, హెల్మెట్ పెట్టుకొని బస్సు నడుపుతానని చెప్పారు.సమాధానం ఇవ్వని బస్సు యజమాని : బస్సు కండిషన్, డ్రైవర్ ఇచ్చిన సమాధానం విన్న ప్రయాణికులు వెంటనే బస్సు యజమానిని సంప్రదించారు. కానీ అతని నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో, ఆందోళనకు గురైయ్యారు. దీంతో చేసేదేమీలేక పోలీసులను ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, బస్సును స్వాధీనం చేసుకుని, రవాణా శాఖ అధికారులకు తెలియజేశారు. బస్సు ప్రయాణానికి అనువుగా లేదని, దానివల్ల తీవ్రమైన ప్రమాదం జరిగే అవకాశం ఉందని, అందుకే దానిని స్వాధీనం చేసుకున్నామని సీఐ సుబ్బారావు తెలిపారు. ఆయన ఈ ఘటనపై కేసు కూడా నమోదు చేశారు.

**ప్రయాణికుల భద్రతపై అశ్రద్ధ :** మార్కాపురంలో ఘోరమైన బస్సు ప్రమాదం జరిగిన కొన్ని రోజులకే ఈ ఘటన చోటు చేసుకుంది. ఆ ఘటనలో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ ఘటన ఇంకా ప్రజల మదిలో నిలిచే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో, ప్రైవేట్ బస్సు యజమానులు తమ బాధ్యతలను పక్కనపెట్టి, ప్రయాణికుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఈ ఘటన తర్వాత, అత్యవసర పనులు ఉన్న ఏడుగురు ప్రయాణికులకు ప్రత్యామ్నాయ వాహనాన్ని ఏర్పాటు చేశారు. అయితే, మిగిలిన ప్రయాణికులు అక్కడికక్కడే చిక్కుకుపోయారు. తమ కోసం మరో బస్సు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరినప్పటికీ, యజమానులు పట్టించుకోలేదు. ఈ ఘటన ప్రైవేట్ బస్సు ఆపరేటర్ల నిర్లక్ష్యాన్ని స్పష్టంగా ఎత్తిచూపుతుంది. ప్రయాణికుల భద్రత విషయంలో మరింత అప్రమత్తత అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ప్రతి ఒక్క విద్యార్థికి ఆరోగ్య పరీక్షలు

**అల్లూరి జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్**

**గిరిజన విద్యార్థులకు ఆరోగ్య రక్ష**

**మంగళగిరి ఎయిమ్స్ వైద్య బృందంతో పరీక్షలకు సన్నాహాలు**

**పిల్లల్లో తరచూ సంభవిస్తున్న మరణాలపై విశ్లేషణ నివేదిక**

**త్వరలో పైలట్ ప్రాజెక్టు**



గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సంస్థలలో చేరిన ప్రతి ఒక్క విద్యార్థికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ దిశగా మంగళగిరిలోని ఎయిమ్స్ (ూ××మీా) వైద్య బృందం సహకారంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. ఈ ప్రయత్నంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడానికి ఒక పైలట్ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు.

**గురుకుల విద్యార్థులలో ఆరోగ్య సమస్యలు :** గురుకుల వ్యవస్థకు అనుబంధంగా ఉన్న పాఠశాలల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు చేరారు. అయితే ఈ విద్యార్థులలో చాలామంది ఇక్కడ విద్యను అభ్యసించడానికి వివిధ ప్రాంతాల నుంచి ప్రయాణిస్తారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల నుంచి వచ్చిన పిల్లలకు తరచుగా మూత్రపిండాలు, గుండె, మెదడు, రక్తం, శ్వాసకోశ సంబంధిత అనారోగ్యాలతో బాధపడుతున్నారు. అంతేకాకుండా, సకాలంలో తగిన వైద్య సంరక్షణ లేకపోవడం వల్ల కొంతమంది విద్యార్థులు ప్రాణాలు కూడా కోల్పోయారు. ఈ వ్యాధులతో బాధపడుతున్న పిల్లలలో అంతవరకు ఆరోగ్యంగా కనిపించిన వారిలో కూడా ముఖం లేదా కాళ్ల వాపు, అధిక జ్వరం, ఇతర సమస్యల వంటి లక్షణాలు కనిపించిన తర్వాత, మరణాలు అకస్మాత్తుగా సంభవిస్తున్నాయి.

**సకాలంలో గుర్తించని సమస్యలు :** ఈ సంఘటనల వెనుక ఉన్న కారణాలను విశ్లేషించిన వైద్య నిపుణులు ఒక కీలకమైన అంశాన్ని గుర్తించారు. పిల్లలలో ఉన్న ఈ ఆరోగ్య సమస్యలను సకాలంలో గుర్తించడంలో వైఫల్యం చెందారు. ఈ ఆరోగ్య సమస్యలు ఒకదాని తర్వాత ఒకటిగా క్రమంగా బయటపడటం వల్ల, అవసరమైన వైద్య చికిత్స అందించడంలో జాప్యం జరిగి మరణాలు సంభవిస్తున్నాయని వెల్లడైంది. అంతేకాకుండా, ఇలాంటి అకాల మరణాల కేసులలో, పోస్ట్‌మార్టం పరీక్షలు నిర్వహించగా, మరణాలకు దారితీసిన నిర్దిష్ట ఆరోగ్య సమస్యలు వెల్లడయ్యాయి.

**సంక్షేమ శాఖ నుంచి అనుమతులు :** ఈ తీవ్రమైన సమస్యలకు పరిష్కారం చూపేందుకు, కూటమి ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించింది. దాంతో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలలో చేరిన విద్యార్థులందరికీ సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ విషయంలో గిరిజన సంక్షేమ శాఖ ఎయిమ్స్ (ూ××మీా) నుంచి అనుమతి పొందింది. ఫలితంగా అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడానికి ఎయిమ్స్ అంగీకరించింది. అంతేకాకుండా, గిరిజన విద్యార్థుల ఆరోగ్య స్థితికి సంబంధించి ప్రస్తుతం ప్రాథమిక సమాచారం పూర్తిగా కోరింది. వారు తరచుగా పోషకాహార లోపం, రక్తహీనత, అంటువ్యాధులతో బాధపడుతున్నారు. వారిని ప్రభావితం చేసే జన్యుపరమైన రుగ్మతలకు సంబంధించి కచ్చితమైన సమాచారం కూడా అంతగా లేదు. దీర్ఘకాలిక వ్యాధుల స్క్రీనింగ్ ప్రక్రియలో చాలా లోపాలు ఉన్నాయి.

**సమగ్ర ఆరోగ్య వివరాలతో డేటాబేస్ :** ఈ పిల్లలను ప్రభావితం చేసే ఆరోగ్య సమస్యలపై ఒక అధ్యయనం నిర్వహించాలని ప్రభుత్వం ఎయిమ్స్‌ను కోరింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఒక పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టనున్నారు. ఈ అధ్యయనం పూర్తి కావడానికి రెండు సంవత్సరాలు పడుతుందని సూచిస్తూ ఎయిమ్స్ బృందం ప్రభుత్వానికి ఒక నివేదికను సమర్పించింది. ఇందులో భాగంగా, ఎయిమ్స్ బృందం ప్రతి విద్యార్థికి ఒక ఆరోగ్య ప్రొఫైల్‌ను క్రియేట్ చేస్తుంది.వారు రక్త సంబంధిత రుగ్మతలు, గుండె సంబంధిత పరిస్థితులు, జీవక్రియ సంబంధిత వ్యాధుల కోసం స్క్రీనింగ్‌లు నిర్వహిస్తారు, అదే సమయంలో ప్రస్తుత రెఫరల్ వ్యవస్థలోని లోపాలను కూడా గుర్తిస్తారు. అంతేకాకుండా, వారు ఈ ఆరోగ్య సమస్యలతో సంబంధం ఉన్న ప్రమాద కారకాలను విశ్లేషిస్తారు . విద్యార్థులలో జన్యుపరమైన రుగ్మతల వ్యాప్తిని అంచనా వేస్తారు. వారి పోషకాహార స్థితిని విశ్లేషించడం ద్వారా, వారు ప్రతి విద్యార్థికి సంబంధించిన వివరణాత్మక ఆరోగ్య సమాచారంతో సమగ్ర డేటాబేస్‌ను రూపొందిస్తారు. దీనిని సాధించడానికి, కంప్లీట్ బ్లడ్ కౌంట్ (జదీజ) నుంచి ఎలక్ట్రోకార్డియోగ్రామ్ (జుజ+) వరకు 11 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

# కడప జిల్లా అత్యధికంగా 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

**రాష్ట్రంలో ఠారెత్తిస్తున్న ఎండలు, వడగాడ్పులు**

**కడప జిల్లా పొట్టిపాడులో అత్యధికంగా 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు**

**కోస్తా, రాయలసీమ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం**



వేసవి కాలం మొదలు కావడంతో రాష్ట్రంలో రోజురోజుకీ ఎండలు, వడగాడ్పులు ఠారెత్తిస్తున్నాయి. ఉదయం 10 గంటలు దాటిందంటే ప్రజల ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడతున్నారు. కాగా ఈ రోజు కడప జిల్లాలోని పొట్టిపాడులో అత్యధికంగా 43.8 డిగ్రీలు, తిరుపతి జిల్లా వరదయ్యపాలెంలో 43.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రేపు రాష్ట్ర 51 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరించారు. మరో 49 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఎండ తీవ్రత, వడగాల్పులు, ఉక్కపోత పట్ల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఉత్తరాంధ్రలో వడగాల్పులు, కోస్తా, రాయలసీమ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో 9, విజయనగరం 18, పార్వతీపురం మన్యం 15, అల్లూరి 1, పోలవరం 3, అనకాపల్లి 3, ఏలూరు జిల్లాల్లోని 2 మండలాల్లో తీవ్రవడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో 2 మండలాలు, విజయనగరం 5, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 4, పోలవరం 9, అనకాపల్లి 5, కాకినాడ 5, తూర్పుగోదావరి 9, ఏలూరు 4, ఎన్టీఆర్ జిల్లాలో 3, పల్నాడు 2, నంద్యాల జిల్లాల్లో 1 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపనున్నట్లు తెలిపారు.వడగాడ్పుల తరుణంలో ఎండలో బయటకు వెళ్లేప్పుడు తలకి టోపి పెట్టుకోవాలని, తెలుపురంగు కాటన్ వస్త్రాలను ధరించాలని అధికారులు సూచించారు. కళ్ల రక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించాలని, చెవుల్లోకి వేడిగాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కాగా గడిచిన రోజు(శనివారం) 200 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కడప జిల్లాలోని పొట్టిపాడులో అత్యధికంగా 44.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

**నగర వాసులు ఉక్కిరిబిక్కిరి:** పగటిపూట ప్రయాణించేవారు టోపీలు, మాస్కులు, మహిళలైతే ముఖానికి వస్త్రాలు రక్షణగా ధరిస్తున్నారు. ఇక విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు ఎండలోనే ప్రయాణిస్తున్నారు. కొందరు వేసవి నుంచి ఉపశమనం కోసం చలివేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. కొందరు కొబ్బరి బోండాలు, శీతల పానీయాల బళ్ల వద్దకు చేరుతున్నారు. భూతాపంతో ఎండలు ఎక్కువగా ఉండే విజయవాడ వంటి ప్రాంతంలో అధిక ఉష్ణోగ్రతలు నగర వాసుల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.వడదెబ్బ వల్ల నమోదైన కేసులు: ఎండలు, వడగాడ్పుల వల్ల వడదెబ్బలు తగిలే ప్రమాదం లేకపోలేదు. రాష్ట్రంలో 2023లో 833, 2024లో 4,444, 2025లో 5,154 చొప్పున వడదెబ్బ కేసులు నమోదయ్యాయి. 2025లో అత్యధికంగా ఏలూరు జిల్లాలో 1,284, కృష్ణా జిల్లాలో 1,214, విశాఖలో 1,089, కడపలో 325, పల్నాడు జిల్లాలో 268 చొప్పున వడదెబ్బ కేసుల నమోదయ్యాయి.

# ఎల్బీనగర్ - హయత్‌నగర్ మధ్య డబుల్ డెక్కర్

**5.5 కిలోమీటర్ల మేర నిర్మాణం**

**ఎల్బీనగర్- హయత్‌నగర్ మార్గంలో డబుల్ డెక్కర్ నిర్మించేందుకు ప్రభుత్వం యోచన**

**5.5 కిలోమీటర్ల డబుల్ డెక్కర్‌కు అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని కోరిన ఆర్‌అండ్‌బీ శాఖ**

**మెట్రో డీపీఆర్‌లో మార్పులు చేసే అవకాశం**



ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ మార్గంలో 7.1 కిలోమీటర్ల మెట్రో రైలు మార్గానికి అనుమతి ఇవ్వాలని హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ (హెచ్‌ఎంఆర్‌ఎల్) కేంద్ర ప్రభుత్వానికి డీపీఆర్ (డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) ఏడాదిన్నర క్రితం పంపింది. ఇదే మార్గంలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 5.5 కిలోమీటర్లు డబుల్ డెక్కర్‌కు ఆమోదం తెలపాలని రహదారులు, భవనాల శాఖ ఇటీవల కేంద్రాన్ని కోరింది. రెండో దానికే అనుమతి ఇవ్వాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరుతున్నారు. నాగ్‌పూర్ మాదిరిగా కింద రహదారి, పైన మెట్రో నిర్మించేందుకు ఆస్కారం ఉంది. తెరమీదకు డబుల్ డెక్కర్ రావడంతో ఈ రూట్‌నకు సంబంధించిన మెట్రో డీపీఆర్‌లో మార్పులు చేర్పులు చేయక తప్పదు.

**జాతీయ రహదారి ట్రాఫిక్‌తో సమస్యలు :** నేషనల్ హైవే 65 మార్గం రద్దీగా మారడం, ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలు పెరగడం కారణంగా ఈ మార్గాన్ని ఎన్‌హెచ్ విస్తరిస్తోంది. చౌటుప్పల్ నుంచి హయత్‌నగర్ వరకు ఇప్పటికే పలు వెహిక్యులర్ అండర్‌పాస్‌లను ఏర్పాటు చేసింది. వనస్థలిపురం వద్ద స్థానికులు అభ్యంతరం తెలపడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

**తప్పనున్న తిప్పలు :** అటు ఫ్లైఓవర్, ఇటు మెట్రో ఎవరికి వారు వేర్వేరుగా కాకుండా డబుల్ డెక్కర్ వేస్తే మేలని ఆర్ అండ్ బీ (రోడ్లు భవనాలు) శాఖ భావిస్తోంది. మెట్రో రైలుతో సంబంధం లేకుండా ఆర్ అండ్ బీనే డిజైన్లు రూపొందించింది. డబుల్ డెక్కర్‌తో మొదటి అంతస్తులో నేషనల్ హైవే మూడు లేన్లు, ఆపైన రెండు వరుసల్లో మెట్రో రైలు మార్గం వచ్చే విధంగా డిజైన్ చేశారు. దీనివల్ల కేంద్రం ఆమోదం లభిస్తే మెట్రో కోసం మరోసారి రోడ్డు విస్తరించే ఇబ్బందులు తప్పనున్నాయి. బేగంపేటలో మాదిరి భవనాల సమీపంలోంచి మెట్రో వెళ్లే తిప్పలు, వాటిలో నివసించే వారికి శబ్దాల గోల తప్పుతాయి. సర్వీస్ రోడ్డులో స్తంభాలు లేకుండా సాఫీగా ప్రయాణం సాగుతుందని స్థానికులు డబుల్ డెక్కర్‌ను స్వాగతిస్తున్నారు.

**రూ.941 కోట్లతో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ :** హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీ ప్రాంతమైన ఎల్బీనగర్-హయత్‌నగర్ మధ్య రూ.941 కోట్లతో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించనున్నట్లుగా రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కొద్దిరోజుల క్రితం ఓ సభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు కీలకమైన రోడ్డు మార్గంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారంతో పాటు నగరంలో 70 కాలనీల్లో నివసిస్తున్న 12 లక్షల మంది ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తొలగిపోతాయని ఆయన వెల్లడించారు. మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు రూ.7,600 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తామని గతంలో పేర్కొన్నారు.మరోవైపు హ్యామ్ విధానంలో రూ.20,000 కోట్లతో తెలంగాణ రాష్ట్రంలో రహదారులకు మహర్దశ పట్టనుందని కొద్ది రోజుల క్రితం కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. కొత్త రోడ్ల నిర్మాణంపై అసెంబ్లీలో సభ్యులడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు సుమారు 5.50 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తామని చెప్పారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.741 కోట్లు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.200 కోట్ల భాగస్వామ్యం ఉంటుందన్నారు. ఈ ప్రతిపాదనలు గత నెల 17న పంపగా కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందని పేర్కొన్నారు. ఆర్నెళ్లలో టెండర్లు నిర్వహించి పనులు చేపట్టే అవకాశం ఉందన్నారు.

# వర్షా కాలంలో నోరూరుంచే మొక్క రెసిపీస్.. ఇలా ట్రై చేయండి!







వర్షాకాలం మొదలైదంటే చాలు వాతావరణంలో మార్పులతో పాటు మన ఆలోచనల్లో కూడా మార్పులు వస్తాయి. వర్షాలు పడిన వెంటనే వేడి వేడిగా, కారంకారంగా ఏదైనా తినాలి అని మనసు లాగేస్తుంది. ముఖ్యంగా వేడిగా బజ్జీలు కనిస్తే మనసు అస్సలు ఆగదు. చటుక్కున నోట్లో వేసుకోవాలనిపిస్తుంది. కానీ అలాంటి ఆయిలీ ఫుడ్ తినడం వల్ల కొన్ని అనారోగ్య సమస్యలు రావచ్చు. కాబట్టి ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా, వర్షం కాలంలో నోటి రుచిగా ఉండే మొక్కజొన్నలు, వాటి నుండి రుచికరమైన, ఆరోగ్యకరమైన వంటకాలను ఎలా తయారు చేసుకోవచ్చో తెలుసుకుందా పదండి. వర్షా కాలంలో లభించే మొక్క జొన్నలు మన ఆరోగ్యానికి ఎంతో ఫోషకాలను అందించడంతో పాటు నోటికి మంచి రుచిని కూడా అందిస్తాయి. అయితే, ఈ మొక్కజొన్నతో మీరు అనేక రకాల రుచికరమైన వంటకాలను తయారు చేసుకోవచ్చు. ఇందుకు కోసం వాటికి కొన్ని రుచికరమైన మసాలా దినుసులు ఉంటే చాలు. మొక్కజొన్నతో రుచికరమైన వంటకం తయారు చేసుకోవచ్చు. వర్షా కాలంలో లభించే మొక్క జొన్నలు మన ఆరోగ్యానికి ఎంతో ఫోషకాలను అందించడంతో పాటు నోటికి మంచి రుచిని కూడా అందిస్తాయి. అయితే, ఈ మొక్కజొన్నతో మీరు అనేక రకాల రుచికరమైన వంటకాలను తయారు చేసుకోవచ్చు. ఇందుకు కోసం వాటికి కొన్ని రుచికరమైన మసాలా దినుసులు ఉంటే చాలు. మొక్కజొన్నతో రుచికరమైన వంటకం తయారు చేసుకోవచ్చు.

ఫస్ట్‌గా రోస్టెడ్ కార్న్ దీన్ని చాలా ఈజీగా తయారు చేసుకోవచ్చు. దీని టేస్ట్ కూడా అదిరిపోతుంది. దీన్ని తయారు చేసుకునేందుకు. మొటగా మీరు ఒక మొక్కజొన్నను తీసుకొని గ్యాస్ మీద తక్కువ మంట మీద వేయించాలి. తరువాత ఒక నిమ్మకాయ తీసుకొని, దానిలో నల్ల ఉప్పు వేసి, మొక్కజొన్న మీద రుద్దు ఆ తర్వాత దాన్ని ఒక ప్లేట్‌లోకి తీసుకొని తింటే చాలా రుచికరంగా ఉంటుంది. ఫస్ట్‌గా రోస్టెడ్ కార్న్ దీన్ని చాలా ఈజీగా తయారు చేసుకోవచ్చు. దీని టేస్ట్ కూడా అదిరిపోతుంది. దీన్ని తయారు చేసుకునేందుకు. మొటగా మీరు ఒక మొక్కజొన్నను తీసుకొని గ్యాస్ మీద తక్కువ మంట మీద వేయించాలి. తరువాత ఒక నిమ్మకాయ తీసుకొని, దానిలో నల్ల ఉప్పు వేసి, మొక్కజొన్న మీద రుద్దు ఆ తర్వాత దాన్ని ఒక ప్లేట్‌లోకి తీసుకొని తింటే చాలా రుచికరంగా ఉంటుంది.

మొక్కజొన్నలో తయారు చేసుకునే మరో వంటకం మొక్కజొన్న చాట్. ఇది ఒక ఆరోగ్యకరమైన ఎంపిక. దీన్ని తయారు చేయడానికి, మొదట ఒక పాత్రలో నీటిని మరిగించి, ఆపై మొక్కజొన్న గింజలను ముక్కలుగా కట్‌చేసి వాటిని 10 నిమిషాలు ఉడకబెట్టండి. ఆ తర్వాత దానిని ఒక ప్లేట్‌లో తీసి ఉల్లిపాయ, టమోటా, పచ్చిమిర్చి, ఉప్పు, చాట్ మసాలా జోడించండి. ప్లేట్‌లోకి సర్వ్ చేసుకొని తింటే నోటికి ఎంతో రుచిగా ఉంటుంది. మొక్కజొన్నలో తయారు చేసుకునే మరో వంటకం మొక్కజొన్న చాట్. ఇది ఒక ఆరోగ్యకరమైన ఎంపిక. దీన్ని తయారు చేయడానికి, మొదట ఒక పాత్రలో నీటిని మరిగించి, ఆపై మొక్కజొన్న గింజలను ముక్కలుగా కట్‌చేసి వాటిని 10 నిమిషాలు ఉడకబెట్టండి. ఆ తర్వాత దానిని ఒక ప్లేట్‌లో తీసి ఉల్లిపాయ, టమోటా, పచ్చిమిర్చి, ఉప్పు, చాట్ మసాలా జోడించండి. ప్లేట్‌లోకి సర్వ్ చేసుకొని తింటే నోటికి ఎంతో రుచిగా ఉంటుంది.

మొక్కజొన్నలో తయారు చేసుకునే మరో వంటకం గ్రిల్డ్ కార్న్. దీన్ని తయారు చేయడానికి, మొక్కజొన్న కాబ్స్ తీసుకొని వాటి తొక్క తీయండి. తరువాత గ్రిల్ ను తక్కువ మంట మీద వేడి చేయండి. తరువాత మొక్కజొన్న కాబ్స్ ను గ్రిల్ మీద ఉంచి, వాటిని మధ్యలో తిప్పుతూ కనీసం 10 నుండి 15 నిమిషాలు ఉడికించాలి. దాని తర్వాత దానిపై వెన్న రాసి, పైన ఉప్పు, చాట్ మసాలా వేయండి. ఇది కూడా చాలా రుచిగా ఉంటుంది. మొక్కజొన్నలో తయారు చేసుకునే మరో వంటకం గ్రిల్డ్ కార్న్. దీన్ని తయారు చేయడానికి, మొక్కజొన్న కాబ్స్ తీసుకొని వాటి తొక్క తీయండి. తరువాత గ్రిల్ ను తక్కువ మంట మీద వేడి చేయండి. తరువాత మొక్కజొన్న కాబ్స్ ను గ్రిల్ మీద ఉంచి, వాటిని మధ్యలో తిప్పుతూ కనీసం 10 నుండి 15 నిమిషాలు ఉడికించాలి. దాని తర్వాత దానిపై వెన్న రాసి, పైన ఉప్పు, చాట్ మసాలా వేయండి. ఇది కూడా చాలా రుచిగా ఉంటుంది.

ఈ రోజుల్లో పిల్లలు ప్రతి వంటకంలోనూ జున్ను ఇష్టపడతారు. కాబట్టి మీరు మొక్కజొన్నకు కొత్త వెర్షన్ కూడా ఇవ్వవచ్చు. ముందుగా దానిని నీటిలో మరిగించండి. తరువాత దానికి జున్ను వేసి కొంత సమయం కాల్చండి. మీకు కావాలంటే, మీకు ఇష్టమైన కూరగాయలను కూడా అందులో చేర్చవచ్చు. ఈ రోజుల్లో పిల్లలు ప్రతి వంటకంలోనూ జున్ను ఇష్టపడతారు. కాబట్టి మీరు మొక్కజొన్నకు కొత్త వెర్షన్ కూడా ఇవ్వవచ్చు. ముందుగా దానిని నీటిలో మరిగించండి. తరువాత దానికి జున్ను వేసి కొంత సమయం కాల్చండి. మీకు కావాలంటే, మీకు ఇష్టమైన కూరగాయలను కూడా అందులో చేర్చవచ్చు.

తందూరి మొక్కజొన్న కూడా ఎంతో రుచిగా ఉంటుంది. దీన్ని ఎలా తయారు చేసుకోవాలంటే. ఫస్ట్ మొక్కజొన్న తొక్క తీసి పక్కన పెట్టుకోండి. తరువాత ఒక పాత్రలో నీరు మరిగించి, ఆ తరువాత మొక్కజొన్నను 5 నిమిషాలు ఉంచి, తక్కువ మంట మీద మరిగించండి. తందూరి మసాలా చేయడానికి, పెరుగులో ఉప్పు, ఎర్ర కారం, చాట్ మసాలా నల్ల ఉప్పు కలిపి బాగా కలపండి. తరువాత ఈ మిశ్రమాన్ని బ్రష్ సహాయంతో అప్లై చేయండి. చిన్న స్టౌపై కాల్చుకొండి. తందూరి మొక్కజొన్న కూడా ఎంతో రుచిగా ఉంటుంది. దీన్ని ఎలా తయారు చేసుకోవాలంటే. ఫస్ట్ మొక్కజొన్న తొక్క తీసి పక్కన పెట్టుకోండి. తరువాత ఒక పాత్రలో నీరు మరిగించి, ఆ తరువాత మొక్కజొన్నను 5 నిమిషాలు ఉంచి, తక్కువ మంట మీద మరిగించండి. తందూరి మసాలా చేయడానికి, పెరుగులో ఉప్పు, ఎర్ర కారం, చాట్ మసాలా నల్ల ఉప్పు కలిపి బాగా కలపండి. తరువాత ఈ మిశ్రమాన్ని బ్రష్ సహాయంతో అప్లై చేయండి. చిన్న స్టౌపై కాల్చుకొండి.

## నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం.. చరిత్ర, ప్రాముఖ్యత,

# ఈ ఏడాది రక్తదాతల దినోత్సవం థీమ్ ఏమిటంటే..



రక్తదానం చేయండి.. ప్రాణదాత కండి ఈ నినాదం గురించి అందరికీ తెలిసిందే. రక్తదానాన్ని గొప్ప దానంగా భావిస్తారు. ఒక యూనిట్ రక్తంముగ్గురు జీవితాలను కాపాడుతుంది. ఇలా రక్తం దానం చేయడం వలన ప్రాణం కాపాడడమే కాదు.. ఆరోగ్యానికి కూడా లాభం. అత్యవసర పరిస్థితుల్లో సరైన సమయంలో రక్తం అందుబాటులో లేకపోతే.. అది రోగి జీవితానికి ప్రాణాంతకం కావచ్చు. ప్రతి సంవత్సరం జూన్ 14వ తేదీ ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ప్రస్తుతం అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్ప దానంగా పరిగణించబడుతుంది. శరీరంలో తగినంత రక్తం లేకపోవడం ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు.. సరైన సమయంలో రక్తం బాధితునికి అందుబాటులో లేకపోతే.. అప్పుడు రోగి జీవితం ప్రమాదంలో పడవచ్చు. అయితే రక్తదానం ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 14న జరుపుకుంటారు. ఈ రోజు ప్రధాన లక్ష్యం.. ప్రజలలో రక్తదానం గురించి అవగాహన కల్పించడం. కనుక ఈ రోజు ప్రపంచ రక్తదాతల దినోత్సవానికి సంబంధించిన కొన్ని విషయాల గురించి తెలుసుకుందాం. ప్రపంచ రక్తదాతల దినోత్సవం చరిత్ర ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని తొలిసారిగా 2004లో జరుపుకున్నారు. 2005లో 58వ ప్రపంచ ఆరోగ్య సభ దీనిని వార్షిక ప్రపంచ కార్యక్రమంగా ప్రకటించింది. అప్పటి నుంచి రక్తదాతల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 14న జరుపుకుంటున్నారు. జూన్ 14 జీవశాస్త్రవేత్త, వైద్యుడు అయిన కార్ల్ ల్యాండ్‌స్టైనర్ పుట్టినరోజు కూడా. ఆయనను ఆధునిక రక్త మార్పిడి స్థాపకుడు అని పిలుస్తారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం 2025 థీమ్ ప్రతి సంవత్సరం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ఒక ప్రత్యేక ఇతివృత్తంతో జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది అంటే 2025 సంవత్సరానికి ఇతివృత్తం "రక్తం ఇవ్వండి, ఆశను ఇవ్వండి: కలిసి మనం అందరం ప్రాణాలను కాపాడుకుందాం". ఈ సంవత్సరం ఇతివృత్తం రక్తదానం ప్రాముఖ్యతను హైలైట్ చేస్తుంది.

**జగన్నాథునికి వేప పొడిని నైవేద్యంగా ఎందుకు సమర్పిస్తారో తెలుసా..**

ప్రపంచ రక్తదాతల దినోత్సవం ప్రాముఖ్యత రక్తదానానికి చాలా ప్రాముఖ్యత ఉంది. జూన్ 14 రక్తదాతలను గౌరవించడానికి అంకితం చేయబడింది. ప్రపంచ రక్తదాతల దినోత్సవం రక్తదానం గురించి అవగాహన పెంచి, రక్తదానం చేయమని ప్రజలను ప్రోత్సహిస్తుంది. రక్తదానం చేయడం వల్ల పేద ధనిక అనే తేడాలేకుండా ప్రమాదంలో ఉన్న వ్యక్తి ప్రాణాలను కాపాడవచ్చు. ఇక రక్త దానం చేయడం వలన అనేక ఆరోగ్య లాభాలు కూడా ఉన్నాయి. రక్తదానం ద్వారా శరీరంలో కొత్త రక్తకణాలు ఉత్పత్తి అవుతాయి. ఇది హృదయ ఆరోగ్యానికి మంచిది. రక్త దానం చేయడం కూడా ఒక సామాజిక బాధ్యత. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు లేదా రక్తహీనతతో బాధపడుతున్నవారికి మీరు ఇచ్చే రక్తం ఒక వరం.

## అరటి పండు నల్లగా మారితే పారేస్తున్నారా?

# ఆగండి ప్రయోజనాలు తెలిస్తే షాక్ అవుతారు!

సాధారణంగా అరటిపండు అనగానే పచ్చిగా లేదా కొద్దిగా పండిన వాటిని తినడానికే చాలామంది ఇష్టపడతారు. కానీ, బాగా పండి, తొక్క నల్లగా మారిన అరటిపండ్లను పారేయడం చాలామంది చేస్తుంటారు. నిజానికి, నల్ల మచ్చలు ఏర్పడిన లేదా పూర్తిగా పండిన అరటిపండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని మీకు తెలుసా? పోషకాలు నిండిన ఈ పండ్లు సులభంగా జీర్ణమవుతాయి. వీటిని తినడం వల్ల కలిగే ప్రయోజనాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పుడు ఒక లుక్కేద్దాం. పండిపోయిన అరటిపండ్లు తినడం సాధారణంగా మంచిదే, కొన్ని ప్రయోజనాలు కూడా ఉన్నాయి. అయితే, కొన్ని విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి. పండిపోయిన అరటిపండ్లు పోషకాలు నిండినవే, చాలా సందర్భాలలో తినడానికి సురక్షితమైనవే. మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి, ముఖ్యంగా మధుమేహం ఉన్నట్లయితే, ఎంత మోతాదులో తీసుకోవాలో చూసుకోవడం మంచిది. ఇలా మెత్తబడిన అరటిపండ్ల ప్రయోజనాలు, తినడం వల్ల కలిగే అనర్థాల గురించి తెలుసుకుందాం..

**సులభంగా జీర్ణం:** అరటిపండు పండిన కొద్దీ, దానిలోని పిండి పదార్థాలు చక్కెరగా మారతాయి. దీనివల్ల జీర్ణం చేసుకోవడం చాలా సులభం. బలహీనమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారికి ఇది మంచిది.

**యాంటీఆక్సిడెంట్లు అధికం:** బాగా పండిన అరటిపండ్లలో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి కణాల నష్టాన్ని నివారించడంలో సహాయపడతాయి, రోగనిరోధక శక్తిని పెంచుతాయి.

**గుండె ఆరోగ్యానికి మంచిది:** వీటిలో పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి, ఇవి రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయి.

**మానసిక ప్రశాంతత:** పండిన అరటిపండ్లలో ట్రిప్టోఫాన్ అనే అమినో ఆమ్లం ఎక్కువగా ఉంటుంది. ఇది సెరోటోనిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది, తద్వారా ఒత్తిడి, ఆందోళనలను తగ్గిస్తుంది, మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది.

**కండరాల నొప్పుల నుండి ఉపశమనం :** పొటాషియం అధికంగా ఉండటం వల్ల కండరాల నొప్పులు, తిమ్మిర్లను తగ్గించడంలో సహాయపడుతుంది.

**రొట్టెలు, స్మూతీలకు ఉత్తమం:** బాగా పండిన అరటిపండ్లు తీపిగా, మెత్తగా మారతాయి. ఇవి అరటిపండు బ్రెడ్, మఫిన్‌లు, స్మూతీలు వంటి వాటికి చాలా బాగుంటాయి. వాటి సహజ తీపి వల్ల అదనపు చక్కెర వేయాల్సిన అవసరం కూడా ఉండదు.



### ఎప్పుడు తినకూడదు/జాగ్రత్తలు:

**చక్కెర స్థాయిలు:** అరటిపండు పండిన కొద్దీ, దానిలోని పిండి పదార్థాలు చక్కెరగా మారతాయి. కాబట్టి, మధుమేహ వ్యాధిగ్రస్తులు లేదా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించుకోవాలనుకునే వారు బాగా పండిన అరటిపండ్లను పరిమితంగా తీసుకోవాలి లేదా వాటికి బదులుగా కొద్దిగా పచ్చిగా ఉన్న అరటిపండ్లను ఎంచుకోవడం మంచిది.

**బరువు తగ్గాలనుకునే వారికి:** బాగా పండిన అరటిపండ్లలో చక్కెర శాతం ఎక్కువగా ఉంటుంది కాబట్టి, బరువు తగ్గాలనుకునే వారు వీటిని ఎక్కువగా తీసుకోకపోవడం మంచిది.

**వాసన/శిలీంధ్రం:** పండు పూర్తిగా నల్లగా మారి, పులిసిన వాసన వస్తే, జిగురుగా మారితే లేదా దానిపై శిలీంధ్రం (ఫంగస్/బూజు) కనిపిస్తే వాటిని తినకూడదు.

**లోపల నల్లగా ఉంటే :** తొక్క నల్లగా ఉన్నప్పటికీ, లోపలి గుజ్జు పూర్తిగా నల్లగా, మెత్తగా మారితే వాటిని పడేయడం మంచిది.

## పసుపు పొడిని ఇలా స్టోర్ చేయండి..


# మస్త్ రోజులు నిల్వ ఉంటది..!



వంటగదిలో మనం ప్రతిరోజూ ఉపయోగించే ముఖ్యమైన మసాలా దినుసుల్లో పసుపు పొడి ఒకటి. పసుపు రుచి, రంగుతో పాటు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. అయితే పసుపు పొడిని ఎక్కువ రోజులు సురక్షితంగా నిల్వ చేయడం కొంచెం కష్టమైన పని. ఎందుకంటే సరిగ్గా నిల్వ చేయకపోతే దానిలో చిన్న పురుగులు, దోమలు వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే పసుపు పొడిని తేమ లేని శుభ్రమైన పరిస్థితుల్లో నిల్వ చేయడం చాలా ముఖ్యం. పసుపు కేవలం వంటకాలకే పరిమితం కాదు. ఇది అనేక ఆరోగ్య లక్షణాలను కలిగి ఉంది. భారతీయ సంప్రదాయంలో పసుపు పవిత్రతకు చిహ్నంగా భావించబడుతుంది. ఇందులో ఉండే కర్క్యూమిన్ అనే సహజ పదార్థం శరీరానికి శక్తిని ఇస్తుంది.. దెబ్బలు, వాపులను తగ్గిస్తుంది. పసుపులోని యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు శరీరాన్ని టాక్సిన్ ల నుండి కాపాడతాయి. ఈ ప్రయోజనాలను పూర్తిగా పొందాలంటే పసుపు పొడిని సరిగ్గా నిల్వ చేయడం తప్పనిసరి. పసుపు పొడిని సురక్షితంగా నిల్వ చేసే మార్గాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. గాలి చొరబడని సీసాలు లేదా డబ్బాలు.. పసుపు పొడిని గాలి చొరబడని సీసాలు లేదా డబ్బాలలో ఉంచాలి. ముఖ్యంగా గాజు సీసాలు ఉత్తమమైనవి. తేమ లేని ప్రదేశం.. పసుపు పొడి ఉంచే ప్రదేశం పూర్తిగా తేమ లేకుండా.. చలికాలంలో తడి పడే చోటు కాకుండా ఉండాలి. పొడి స్పూన్ వాడకం.. పసుపు పొడిని తీసేందుకు తడి లేని స్పూన్ ఉపయోగించాలి. తడి స్పూన్ వాడితే తేమ చేరి పురుగులు వచ్చే అవకాశం ఉంటుంది. చిన్న భాగాలుగా నిల్వ.. ఒకేసారి ఎక్కువ పసుపు పొడిని ఒకే డబ్బాలో ఉంచకుండా చిన్న చిన్న భాగాలుగా విడదీసి వాడటానికి వేర్వేరు డబ్బాలలో నిల్వ చేయడం మంచిది. కొత్తగా తీసిన పసుపు కొమ్ముల్లో మట్టితో కలిసిన చెదలు ఎక్కువగా ఉంటాయి. అందుకే వాటిని కొన్న వెంటనే శుభ్రంగా కడగాలి. ముందుగా ఒక బౌల్ నిండా నీటిలో వేసి బాగా కదిలిస్తూ చక్కగా కడగాలి మట్టి పూర్తిగా తొలగేలా చూడాలి. అనంతరం ఆ పసుపు తడి లేకుండా ఉండేలా స్పాంజ్ గానీ.. శుభ్రమైన కాటన్ గానీ ఉపయోగించి తుడవాలి. తడి పూర్తిగా పోయేంత వరకు వర్షంలో లేదా తేమ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ఉంచకూడదు. పసుపు పూర్తిగా ఆరిన తర్వాత వాటిని కాగితం టవల్ తో చుట్టాలి. తర్వాత గాలి చొరబడని ఎర్ టైట్ డబ్బాలో వేసి ఫ్రిజ్ లోని కూరగాయల విభాగంలో నిల్వ చేయాలి. అవసరమైతే ఆ తరువాత వాటిని చిన్న ముక్కలుగా కట్ చేసి జిప్ లాక్ కవర్ లో పెట్టి ఫ్రీజర్ లో కూడా భద్రపరచవచ్చు. ఇలా చేస్తే పసుపు ఎక్కువ రోజులు నాణ్యతతో ఉండే అవకాశం ఉంటుంది. పసుపు పొడి లాంటి మసాలా పదార్థాలను ఎప్పటికీ నేరుగా ఎండ తగిలే ప్రదేశాల్లో ఉంచకూడదు. ఎక్కువ వెలుతురు లేదా వేడి ఉన్న ప్రదేశాల్లో ఉంచితే పసుపు తన అసలైన లక్షణాలను కోల్పోతుంది. రంగు మారిపోవచ్చు, దుర్వాసన రావచ్చు. అందుకే పసుపు పొడిని చల్లగా నీడ ఉన్న ప్రదేశంలో ఉంచడం ఉత్తమం. ఈ సూచనలు పాటిస్తే మీరు ఇంట్లో ఉన్న పసుపు పొడిని.. అలాగే తాజా పసుపును నాణ్యత కోల్పోకుండా ఎక్కువ రోజుల పాటు తాజాగా ఉంచుకోవచ్చు. ఆరోగ్య ప్రయోజనాలు పొందడానికి ఇలా నిల్వ చేయడమే ఉత్తమమైన మార్గం.

## డయాబెటిస్‌తో బాధపడుతున్నారా..

# ఈ 6 పానీయాలను అస్సలు తాగకండి..



ఈ మధ్య కాలంలో చాలా మంది డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. చిన్న పిల్లలు మొదలుకుని పెద్దల వరకు అందరూ ఈ వ్యాధి బారిన పడుతున్నారు. అయితే, ఈ సమస్య ఉన్నవారు కొన్ని పానీయాలను తీసుకోవడం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. ఈ రోజుల్లో జీవనశైలి మారిపోవడం వల్ల చాలా మంది ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. అందులో ముఖ్యమైనది డయాబెటిస్. చిన్న పిల్లలు మొదలుకుని పెద్దల వరకు చాలా మంది ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. మధుమేహం ఒకసారి వస్తే, అది శరీరాన్ని నెమ్మదిగా ప్రభావితం చేస్తుంది. కాబట్టి, ఇలాంటి వారు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. అంతేకాకుండా, కొన్ని పానీయాలు నివారించాలి. ఎందుకంటే ఇవి ఆరోగ్యంగా కనిపించవచ్చు కానీ డయాబెటిస్ ఉన్నవారికి ప్రమాదకరం. కాబట్టి, ఈ 6 పానీయాలను అస్సులు తాగకూడదని నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

**తీపిగా ఉన్న టీ :** రోజూ తాగే టీలో ఎక్కువ చక్కెర కలిపితే అది మధుమేహ ప్రమాదాన్ని పెంచుతుంది. పైగా టీలో ఉండే కెఫిన్ కూడా రక్తంలో చక్కెర స్థాయిని పెంచే ప్రమాదం ఉంటుంది. కాబట్టి, హెర్బల్ టీను మాత్రమే తాగడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

**ఆల్కహాల్ :** మధుమేహం ఉన్నవారు కొన్నిసార్లు మద్యం అప్పుడప్పుడు తాగితే ఏం అవుతుందులే అని అనుకుంటారు. కానీ మద్యంలో చక్కెరలు, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి. తరచుగా తాగితే కాలేయం బలహీనమవుతుంది. ఇది రక్తంలో చక్కెర నియంత్రణను దెబ్బతీసి డయాబెటిస్ రిస్కను పెంచుతుంది. కాబట్టి, ఆల్కహాల్ పూర్తిగా మానేయడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.


**ఎనర్జీ డ్రింక్స్ :** ఎనర్జీ డ్రింక్స్ లో చక్కెర ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, మధుమేహం ఉన్నవారు వీటిని తీసుకోవడం మంచిది కాదు. సహజ శక్తి కావాలంటే మంచి ఆహారం తీసుకోవడం ఉత్తమం.

**సోడాజి :** డయాబెటిస్ ఉన్న వారికి సోడా ప్రమాదకరం. ఎందుకంటే ఇందులో చక్కెర ఎక్కువగా ఉండేలా తయారు చేస్తారు. రోజూ సోడా తాగితే డయాబెటిస్ పెరిగే ప్రమాదం రెట్టింపు అవుతుంది. దానికంటే కొబ్బరినీరు, తాజా నిమ్మరసం తాగడం మంచిది.

**తీపిగా ఉన్న కాఫీ :** విప్డ్ క్రీమ్, స్వీట్ సిరప్ వేసిన కాఫీలు బయట స్టోర్లలో అందుబాటులో ఉంటున్నాయి. ఇవి రుచిగా ఉంటాయి కానీ ఎక్కువగా తాగితే మధుమేహం, మెటబాలిక్ సిండ్రోమ్ వంటి సమస్యలు వస్తాయి. మంచి అలవాటు కోసం, తక్కువ చక్కెర కాఫీని తీసుకోండి.

**పండ్ల రసాలు :** తాజా పండ్ల రసాలు ఆరోగ్యంగా అనిపించవచ్చు కానీ.. వీటిలో ఫైబర్ తక్కువగా, చక్కెర ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెరను వేగంగా పెంచుతుంది. కాబట్టి పండ్ల రసం కంటే నేరుగా తినడం మంచిది. డయాబెటిస్ ఉన్నవారు ఏదైనా తాగే ముందు ఆలోచించాలి. ఆరోగ్యంగా అనిపించిన, తీపిగా ఉండే పదార్థాలను జాగ్రత్తగా తీసుకోవాలి. సరైన జీవనశైలి, సరైన ఆహారం మధుమేహాన్ని పూర్తిగా నియంత్రించవచ్చు.

## ఇలా చేస్తే ఆరోగ్య సమస్యల నుంచి బయటపడొచ్చు!



ఎనిమిది గంటలైనా కుర్చీలో కూర్చుని కంప్యూటర్‌పై పనిచేస్తూ ఉంటారు. ఇలా ఎక్కువ సేపు కూర్చోవటం వల్ల రకరకాల ఆరోగ్య సమస్యలు వస్తూ ఉంటాయి. ఈ సమస్యలు రాకుండా ఆఫీసులో కూర్చుని చేసే 'యోగా' ఇప్పుడిప్పుడే ప్రాచుర్యంలోకి వస్తోంది. అలాంటి యోగాసనాలేమిటో ఏమిటో చూద్దాం...

**విశ్రాంతి కోసం :** ఎక్కువ సేపు కుర్చీలో కూర్చుని పనిచేస్తే ఒక విధమైన అలసట వస్తుంది. ఇది తొలగిపోవటానికి కుర్చీలో కూర్చునే విశ్రాంతి తీసుకొనే ఆసనం ఒకటుంది. కుర్చీలో నడుమును నిటారుగా ఉంచి...అరిచేతులను తొడలపై ఉంచాలి. మూడు నిమిషాలు కళ్లు మూసుకొని దీర్ఘశ్వాసలు తీసుకోవాలి. ఇలా రోజుకు కనీసం రెండు సార్లు చేస్తే అలసట తొలగిపోతుంది.

**నడుము నొప్పి పోవాలంటే :** నడుము నెప్పి పోవాలంటే ముందు ఉన్న డెస్క్‌పై చేతులు ఉంచాలి. తల పైకెత్తి నడుమును ముందుకు వంచాలి. పది సెకన్ల తర్వాత నడమును లోపలికి వంచి తలను డెస్క్ వైపు వచ్చేలా వంచాలి. ఇలా పది సార్లు చేస్తే నడుము నెప్పికి కొంత ఉపశమనం లభిస్తుంది.

**అరచేయి.. మోచేతి నొప్పులు పోవాలంటే :** పిడికిలి బిగించి చేతిని ముందుకు చాపాలి. పిడికిలిని గుండ్రంగా ఎడమవైపునకు.. ఆ తర్వాత కుడివైపునకు తిప్పాలి. ఇలా పది సార్లు చేసిన తర్వాత రెండు చేతులను ముందుకు చాపి అరిచేతి భాగం ముందకు వచ్చేలా వేళ్లను లాక్ చేయాలి. ఇలా చేతులను ముందుకు.. వెనక్కు కదపాలి. ఇలా పది సార్లు చేయాలి. ఈ రెండు ఎక్సర్‌సైజ్‌ల వల్ల చేతుల నెప్పులు తగ్గుతాయి.ం

**తొడ కండరాల కోసం :** ఎక్కువ సేపు కుర్చీలో కదలకుండా కూర్చుంటే తొడ కండరాలు బిగిసుకుపోతాయి. ఈ ఇబ్బందిని తొలగించటానికి కుర్చీలో నిటారుగా కూర్చుని.. ఎడమ కాలి మడమను కుడి కాలి తొడపై పెట్టాలి. ఆ తర్వాత కళ్లు మూసుకొని 7 నుంచి 10 సార్లు దీర్ఘశ్వాసను తీసుకోవాలి. ఇలా చేస్తే తొడ కండరాలపై ఒత్తిడి తొలగిపోతుంది.

అక్షర టైమ్స్

# "పర్సనల్ లోన్" తీసుకుంటున్నారా

## ఈ తప్పులు చేస్తే అప్పుల ఊబిలో చిక్కుకున్నట్లే!

## వ్యక్తిగత రుణం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

## అప్రమత్తంగా లేకుంటే అదనపు భారమే అంటున్న నిపుణులు!




ఆర్థిక అవసరాలు ఎవరికి ఎప్పుడు, ఏ విధంగా వస్తాయో చెప్పలేం. అలాంటి పరిస్థితుల్లో అత్యవసరంగా డబ్బులు అవసరమైనప్పుడు మనలో మెజార్టీ పీపుల్‌కు ముందుగా గుర్తొచ్చేవి "పర్సనల్ లోన్స్(వ్యక్తిగత రుణాలు)". ఈజీగా లభించడం, వీటికి ఎలాంటి హామీ ఇవ్వాల్సిన అవసరం లేకపోవడం, రీపేమెంట్‌కు ఎక్కువగా టైమ్ ఉండడం ఇందుకు ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. అందుకే, అత్యవసర సమయాల్లో డబ్బులు అవసరం పడినప్పుడు చాలా మంది పర్సనల్ లోన్ తీసుకునేందుకు ఇంట్రెస్ట్ చూపిస్తుంటారు. అయితే, పర్సనల్ లోన్ విషయంలో మీరు చేసే చిన్న చిన్న పొరపాట్ల వల్ల కొన్నిసార్లు ఎక్కువగా నష్టపోయే అవకాశం ఉంటుందంటున్నారు ఆర్థిక నిపుణులు. మీకు తెలియకుండానే ఆ చిన్న మిస్టేక్స్ మిమ్మల్ని అప్పుల ఊబిలోకి నెట్టే ఛాన్స్ లేకపోలేదని హెచ్చరిస్తున్నారు. అలా జరగకూడదంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరమంటున్నారు. ఇంతకీ, పర్సనల్ లోన్ విషయంలో చేయకూడని ఆ తప్పులు ఏంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం.

**అవసరమైనంతే లోన్ :**

పర్సనల్ లోన్ విషయంలో మనలో చాలా మంది చేసే అతి పెద్ద పొరపాటు ఏంటంటే అవసరానికి మించి లోన్ తీసుకుంటుంటారు. ముఖ్యంగా ఎలిజిబిలిటీ ఉందనో, ఇంకేదైనా కారణం వల్లనో ఎక్కువ లోన్ తీసుకుని తీరా చెల్లించడానికి ఇబ్బందిపడుతుంటారు. అలా జరగకుండా ఉండాలంటే.. మీకు ఎంత డబ్బు అవసరం? ప్రతి నెలా మీ ఆదాయంలో ఖర్చులన్నీ పోనూ ఎంత మిగులుతుంది? వంటి విషయాలన్నీ లెక్కలోకి తీసుకుని మాత్రమే లోన్ మొత్తాన్ని ఎంచుకోవాలి. బ్యాంకు ఎక్కువ మొత్తాన్ని అప్రూవ్ చేస్తుందని కాకుండా, మీకు అవసరమైన మొత్తాన్నే తీసుకోవాలి. ఇలా చేస్తే భవిష్యత్తులో అప్పుల ఊబిలో పడకుండా ఉంటారని సూచిస్తున్నారు నిపుణులు. రుణ భారం పెరిగిపోకుండా జాగ్రత్త పడొచ్చంటున్నారు.

**అగ్రిమెంట్‌ను అర్థం చేసుకోవాలి :**

పర్సనల్ లోన్ తీసుకునే ముందు బ్యాంక్ లేదా రుణ సంస్థతో చేసుకునే ఒప్పందాన్ని ఒకటికి రెండుసార్లు పూర్తిగా చదవాలి. అందులోని విషయమేదైనా మీకు అర్థం కాకపోతే వారి ప్రతినిధిని అడిగి తెలుసుకోవాలి. లోన్ డాక్యుమెంట్‌లో ప్రాసెసింగ్ ఫీజులు, ఫోర్ క్లోజర్ ఛార్జీలు, వడ్డీ రేట్లు, ఫైన్లు సహా అన్ని వివరాలు ఉంటాయి. అందుకే, లోన్ అగ్రిమెంట్‌పై సంతకం చేసే ముందే నిబంధనలు, షరతులను జాగ్రత్తగా చదవాలి. అవన్నీ వివరంగా అడిగి తెలుసుకున్నాకే అగ్రిమెంట్‌కు ఓకే చెప్పి లోన్ తీసుకోవడం బెటర్ అంటున్నారు నిపుణులు.

**తక్కువ వడ్డీకి ప్రాధాన్యం ఇవ్వాలి :**

మీ క్రెడిట్ స్కోర్ బాగుంటే చాలా బ్యాంకులు, రుణ సంస్థలు లోన్ ఇవ్వడానికి ముందుకొస్తాయి. అయితే, వాటిల్లో దేనిలో తక్కువ వడ్డీ, రూల్స్ సరళంగా ఉంటాయో తెలుసుకుని అందులోనే లోన్ తీసుకోవడం మంచిదని అని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే కొన్ని బ్యాంకులు వడ్డీతో పాటు అదనపు ఛార్జీలు వసూలు చేస్తుంటాయి. ఇవి మనకు లభించాల్సిన వడ్డీ ప్రయోజనాన్ని తుడిచిపెట్టేస్తాయి. అందుకే, దేనిలో తక్కువ వడ్డీ రేటుతో పాటు అదనపు ఛార్జీల ఇబ్బంది ఉండదో దానిలో తీసుకోవడం బెటర్ అంటున్నారు.

**ఈ విషయాలు గుర్తుంచుకోవాలి!**

లోన్స్ తీసుకునేవారు గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయమేమిటంటే, అప్పు అనేది ఎప్పటికీ ఒక విధమైన భారమే. అందుకే, కచ్చితంగా అవసరమైనప్పుడు మాత్రమే పర్సనల్ లోన్ తీసుకోవడం చేయాలని సూచిస్తున్నారు ఆర్థిక నిపుణులు. అంతేకానీ, విలాసవంతమైన జీవనం గడపాలని ఖరీదైన గ్యాడ్జెట్లు, లగ్జరీ కారు కొనాలనే కోరికతో పర్సనల్ లోన్ తీసుకుని ఆర్థిక ఉచ్చులో పడొద్దని హెచ్చరిస్తున్నారు. అలాగే, స్టాక్స్,

# ధనిక, పేద దేశాల మధ్య అంతరం మరింత పెరుగుతోంది: ఐరాస నివేదిక

## ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌లను సంస్కరించడంలో జాప్యం

## 2025 జూన్ 'సెవిల్లే తీర్మానం' అమలులో వైఫల్యం

## అందుకే ధనిక, పేద దేశాల మధ్య అంతరం పెరుగుతోంది

## ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక



ధనిక, పేద దేశాల మధ్య అంతరం మరింత పెరుగుతోందని ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక వెల్లడించింది. ప్రధానమైన ప్రపంచ ఆర్థిక సంస్థలను సంస్కరించడంలో జాప్యం సహా, గత సంవత్సరం(2025లో) అనేక దేశాలు అంగీకరించిన చర్యలేవీ అమలుకు నోచుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఐక్యరాజ్యసమితి తెలిపింది. 2030 నాటికి పేదలను అభివృద్ధి బాటలోకి తేవాలనే లక్ష్యాలతో 2015లో ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను రూపొందించిందని నివేదిక గుర్తుచేసింది. వీటి సాధనకు పాటుపడాలని 2025 జూన్‌లో సెవిల్లే (స్పెయిన్)లో జరిగిన ఫైనాన్సింగ్ ఫర్ డెవలప్‌మెంట్ (ఫీటణ4) సదస్సులో 192 దేశాలు (అమెరికా మినహా) ఏకగ్రీవంగా తీర్మానించాయని పేర్కొంది. ఈ తీర్మానం అమలు కోసం 4 ట్రిలియన్ డాలర్ల వార్షిక ఆర్థిక లోటును పూడ్చాలనే లక్ష్యాన్ని 192 దేశాలు పెట్టుకున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పెట్టుబడులను పెంచడం, ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) లాంటి ఆర్థిక సంస్థల్లో సంస్కరణలు వంటివన్నీ చేయాలని నిర్ణయించారని నివేదిక చెప్పింది. వాషింగ్టన్ డీసీ వేదికగా ఏప్రిల్ 13 నుంచి 18 వరకు ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు సంయుక్త సమావేశాలు జరగనున్న వేళ విడుదలైన ఐరాస నివేదిక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

**అభివృద్ధి చెందుతున్న దేశాలపై ట్రంప్ సుంకాల ప్రభావం**

వాణిజ్య అవరోధాలు పెరుగుతుండటం, పదేపదే సంభవిస్తున్న వాతావరణ వైపరీత్యాలు కూడా ధనిక, పేద దేశాల మధ్య అంతరం పెరగడానికి కారణం అవుతున్నాయని ఐరాస నివేదిక పేర్కొంది. దేశాల మధ్య ఆర్థిక అంతరం లేకుండా చేయాలంటే 2025 జూన్‌లో సెవిల్లేలో చేసిన తీర్మానాన్ని అమలు చేయడమే ఏకైక మార్గమని స్పష్టంచేసింది. అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం విధించిన భారీ సుంకాలు సైతం అభివృద్ధి చెందుతున్న దేశాలను అత్యంత ప్రతికూలంగా ప్రభావితం చేశాయని నివేదిక తెలిపింది. 2025లో ప్రపంచంలోని అత్యంత పేద దేశాల ఎగుమతులపై విధించిన సుంకాలు సగటున 9 శాతం నుంచి 28 శాతానికి పెరిగాయని గుర్తుచేసింది. ఇక అభివృద్ధి చెందుతున్న దేశాల (చైనా మినహా) ఎగుమతులపై విధించిన సుంకాలు 2 శాతం నుంచి 19 శాతానికి పెరిగాయని నివేదిక చెప్పింది.

**పేద దేశాలకు కేటాయించే నిధులు తగ్గుముఖం**

"పశ్చిమాసియా ప్రాంతంలో జరుగుతున్న యుద్ధం అభివృద్ధి చెందుతున్న దేశాల సమస్యలు, సవాళ్లను మరింత పెంచుతోంది. దీనివల్ల ఆయా దేశాలు ఆర్థిక వనరులు, పెట్టుబడులను ఆకర్షించేందుకు అనువైన వాతావరణం లేకుండా పోతోంది. అంతర్జాతీయ సహకారం విషయంలోనూ ఇది అత్యంత ప్రమాదకరమైన సమయం. ఎందుకంటే ఇప్పుడు ప్రాంతీయ సమీకరణాలే ప్రపంచ దేశాల ఆర్థిక సంబంధాలు, విధానాలను నిర్ణయిస్తున్నాయి. పేద దేశాలకు సహాయం చేసేందుకు కేటాయించే నిధులను 2025లో 25 దేశాలు తగ్గించాయి. దీంతో 2024తో పోలిస్తే 2025లో పేద దేశాలకు అందే ఆర్థిక సాయం 23 శాతం తగ్గిపోయింది. ఒక్కసారిగా ఇంత భారీగా ఆర్థిక సాయం తగ్గడం ఇదే తొలిసారి. పేద దేశాలకు చేసే సాయాన్ని అమెరికా అత్యధికంగా 59 శాతం మేర తగ్గించింది. ఈ లెక్కన 2026లో పేద దేశాలకు అందే ఆర్థికసాయం మరో 5.8 శాతం మేర తగ్గిపోయే అవకాశాలు ఉన్నాయి" అని ఐక్యరాజ్యసమితి అండర్ సెక్రెటరీ జనరల్ లీ జున్‌హువా తెలిపారు.

**ఇరాన్ - అమెరికా యుద్ధంతో నీలినీడలు**

"ప్రపంచ దేశాల అభివృద్ధికి పాటుపడాలనే సన్నద్ధతతో మేం ఉన్నాం. కానీ ఇరాన్ - అమెరికా యుద్ధం అనేది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకునే దుస్థితిని తీసుకొచ్చింది" అని ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జీవా తెలిపారు.

**ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌లపై ఐరాస చీఫ్ విమర్శలు**

పేద దేశాలకు మేలు చేసేలా ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌లలో సంస్కరణలు చేయాలని గతంలో చాలాసార్లు ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ గళమెత్తారు. ధనిక దేశాలకే మేలుచేసేలా ఐఎంఎఫ్ పనిచేస్తోందని ఆయన విమర్శించారు. ప్రపంచ బ్యాంకు తన అసలైన మిషన్ నుంచి గాడి తప్పిందని ఐరాస చీఫ్ పేర్కొన్నారు. ప్రత్యేకించి కరోనా (కొవిడ్ - 19) సంక్షోభ కాలంలో డజన్ల కొద్దీ దేశాలు అప్పుల ఊబిలో చిక్కుకొని విలవిలలాడుతుంటే ఆదుకునేందుకు ప్రపంచ బ్యాంకు చొరవ చూపలేదన్నారు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకులలో సంస్థాగత నిర్ణయాలు తీసుకునే కీలక విభాగాల్లో అమెరికా, ఐరోపా వంటి ధనిక దేశాల పెత్తనమే కొనసాగుతోంది. ఈ అంశాన్ని బయటపెట్టే దిశగానే ఐరాస చీఫ్ విమర్శలు ఉన్నాయి.

# వాట్సాప్‌ను నమ్మలేమన్న ఎలాన్ మస్క్, టెలిగ్రామ్ సీఈఓ

## అవన్నీ అబద్ధాలన్న మెటా

## వాట్సాప్ ఎన్‌క్రిప్షన్‌పై మస్క్, దురోవ్ ఆరోపణలు

## నిజమైన ప్రైవసీ కోసం ఎక్స్ ఛాట్‌లోకి మారిపోవాలన్న మస్క్

## చరిత్రలోనే అతిపెద్ద కన్స్యూమర్ మోసమన్న దురోవ్

వాట్సాప్‌ను నమ్మలేం అంటూ ఎక్స్ (ట్విట్టర్) అధిపతి ఎలాన్ మస్క్, టెలిగ్రామ్ సీఈఓ పావెల్ దురోవ్ చేసిన తాజా వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. వాట్సాప్ మెసేజ్‌లన్నీ ప్రైవేట్ అనే వాదనతో విభేదిస్తూ మెటా(ఫేస్‌బుక్), వాట్సాప్‌లపై మార్చి 25న అమెరికాలో దాఖలైన క్లాస్ యాక్షన్ న్యాయ వ్యాజ్యాన్ని ప్రస్తావిస్తూ గురువారం రోజు (ఏప్రిల్ 9న) ఎలాన్ మస్క్ ఒక ట్వీట్ చేశారు. వాట్సాప్‌ను నమ్మలేం అని ఆయన వ్యాఖ్యానించారు. ఆ వెంటనే మస్క్ మరో ట్వీట్ చేశారు. మెసేజింగ్, వాయిస్ కాల్స్, వీడియో కాల్స్ కోసం వాట్సాప్ యూజర్లు వెంటనే ఎక్స్ ఛాట్‌లోకి మారిపోవాలని పిలుపునిచ్చారు. ఎక్స్ ఛాట్ నిజమైన ప్రైవసీ అనే గొప్ప ప్రయోజనాన్ని అందిస్తుందని ఆయన రాసుకొచ్చారు. వాట్సాప్‌లో ఎన్‌క్రిప్షన్ అనేది చరిత్రలోనే అతిపెద్ద కన్స్యూమర్ మోసం అంటూ టెలిగ్రామ్ సీఈఓ పావెల్ దురోవ్ శుక్రవారం (ఏప్రిల్ 10న) ఒక ట్వీట్ చేశారు. వందల కోట్ల మంది యూజర్లను వాట్సాప్ మోసగిస్తోందని ఆయన ఆరోపించారు. వాట్సాప్ అందరు యూజర్ల మెసేజ్‌లను చదువుతుందని, వాటిని థర్డ్ పార్టీలకు షేర్ చేస్తుందన్నారు. వాట్సాప్‌లో ఎన్‌క్రిప్షన్ అనేది ఎన్నడూ జరగలేదని, ఇకపైనా జరగదని దురోవ్ వ్యాఖ్యానించారు.




**మెటా, వాట్సాప్ రియాక్షన్ ఇదీ**

ఎలాన్ మస్క్, పావెల్ దురోవ్ ఆరోపణలను ఖండిస్తూ శుక్రవారం (ఏప్రిల్ 10న) మెటా అధికార ప్రతినిధి, వాట్సాప్ టీమ్ ఓ ప్రకటన విడుదల చేశారు. వాట్సాప్‌కు చెందిన మెసేజ్ ఎన్‌క్రిప్షన్ వ్యవస్థపై పలువురు చేసిన ఆరోపణలన్నీ పూర్తిగా అబద్ధాలని, అవి అసంబద్ధమైనవని వారు తేల్చి చెప్పారు. ఈ ఏడాది జనవరిలో వాట్సాప్‌పై దాఖలైన న్యాయ వ్యాజ్యంలోని ఆరోపణలు కూడా అవాస్తవాలే అని స్పష్టం చేశారు. సిగ్నల్ ప్రొటొకాల్‌ను వినియోగించి అన్ని వాట్సాప్ మెసేజ్‌లను ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్టెడ్‌గా ఉంచుతామని, మెసేజ్ పంపిన వ్యక్తి, రిసీవ్ చేసుకున్న వ్యక్తి మినహా ఎవ్వరూ వాటిని చదవలేరని వాట్సాప్ టీమ్ వెల్లడించింది.

**ఎలాన్ మస్క్ , మార్క్ జుకర్‌బర్గ్**

ఎక్స్ అధిపతి ఎలాన్ మస్క్, మెటా (ఫేస్‌బుక్) సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ సోషల్ మీడియా మొగల్స్‌గా ఓ వెలుగు వెలుగుతున్నారు. వారిద్దరి మధ్య చాలా కాలంగా వ్యాపారపరమైన పోటీ ఉంది. ఈక్రమంలోనే 2022 అక్టోబరు 27న ట్విట్టర్‌ను ఎలాన్ మస్క్ కొనుగోలు చేశారు. తనతో కేజ్ ఫైట్ చేయడానికి రావాలని జుకర్‌బర్గ్‌ను కోరుతూ 2023 జూన్‌లో ఎలాన్ మస్క్ ఒక ట్వీట్ చేశారు. బ్రెజీలియన్ జియూ జిట్సులో శిక్షణ పొందిన జుకర్‌బర్గ్ దీనిపై స్పందిస్తూ, తనకు లొకేషన్‌ను పంపాలంటూ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఎలాన్ మస్క్‌కు రిప్లై ఇచ్చారు. ఈనేపథ్యంలో ఎక్స్‌కు పోటీగా 2023 జులై 5న థ్రెడ్స్‌ను మెటా లాంచ్ చేసింది. 2025లో తన ఏఐ ఛాట్‌బోట్ గ్రోక్‌ను హైలైట్ చేస్తూ ఒక మీమ్‌ను ఎలాన్ మస్క్ ట్వీట్ చేశారు. మెటా ఏఐ కంటే అధునాతనమైంది గ్రోక్ ఏఐ అని ఆయన ప్రకటించారు.

**వాట్సాప్‌పై దాఖలైన 2 వ్యాజ్యాలివీ**

వాట్సాప్ మెసేజ్‌లు, ఛాట్‌లు, కాల్స్ ఎన్‌క్రిప్షన్‌పై ప్రశ్నలు, సందేహాలను లేవనెత్తుతూ ఈ ఏడాది అమెరికాలో 2 న్యాయపరమైన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వాట్సాప్‌పై తొలి వ్యాజ్యం 2026 జనవరి 23న కాలిఫోర్నియా ఉత్తర జిల్లా కోర్టులో దాఖలైంది. ఇది గ్లోబల్ క్లాస్ యాక్షన్ న్యాయ వ్యాజ్యం. వివిధ దేశాలకు చెందిన ఏడుగురు వాట్సాప్ యూజర్లు కలిసి ఈ పిటిషన్ వేశారు. వీరిలో ఇద్దరు ఆస్ట్రేలియన్లు, అల్కా గౌర్ అనే భారతీయురాలు, ఇద్దరు బ్రెజీలియన్లు, 1 మెక్సికన్, 1 దక్షిణాఫ్రికా పౌరుడు ఉన్నారు. ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ పేరుతో యూజర్లను వాట్సాప్ తప్పుదోవ పట్టిస్తోందని వారు ఆరోపించారు. అన్ని వాట్సాప్ మెసేజ్‌లను తెర వెనుక నుంచి చదువుతున్నారని, విశ్లేషిస్తున్నారని పిటిషనర్లు పేర్కొన్నారు. వాట్సాప్‌పై రెండో వ్యాజ్యం 2026 మార్చి 25న కాలిఫోర్నియా ఉత్తర జిల్లా కోర్టులో దాఖలైంది. అమెరికాకు చెందిన వాట్సాప్ యూజర్లు వై షిరాజీ, నిదా సామ్సన్‌లు 'యూఎస్ క్లాస్ యాక్షన్ న్యాయ వ్యాజ్యాన్ని' వేశారు. మెటా, వాట్సాప్‌లు అక్రమంగా యూజర్ల మెసేజ్‌లను చూశాయని, చదివాయని, వాటిని స్టోర్ చేశాయని వారు ఆరోపించారు. ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ పేరుతో ఇస్తున్న హామీని వాట్సాప్ నిలుపుకోవడం లేదన్నారు. ఈ రెండు న్యాయ వ్యాజ్యాల్లోనూ పిటిషనర్లు ఒకే విధమైన డిమాండ్లు చేశారు. వాట్సాప్ మెసేజ్‌లు, కాల్స్ ఎన్‌క్రిప్షన్‌పై న్యాయ విచారణ జరగాలని వారు కోరారు. వాట్సాప్ బాధితులకు పరిహారాన్ని అందించాలని, యూజర్లకు జరిగిన నష్టాన్ని భర్తీ చేయాలని కోర్టుకు విన్నవించారు.

# డీజిల్, విమాన ఇంధనం ఏటీఎఫ్‌పై ఎగుమతి సుంకాన్ని పెంచిన కేంద్రం

## డీజిల్‌పై విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను లీటరుకు 55.50 పైసలు

## విమాన ఇంధనంపై పన్నును 42 రూపాయలకు పెంపు

## ఇంధన లభ్యతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం



పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ ప్రభావం ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్రంగా పడుతోంది. ఈ నేపథ్యంలో దేశీయంగా ఇంధన కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డీజిల్, విమాన ఇంధనం (ఏటీఎఫ్)పై ఎగుమతి సుంకాలను పెంచింది. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. పెంచిన సుంకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**ఎగుమతులపై నియంత్రణ తీసుకురావడమే లక్ష్యం!**

డీజిల్‌పై విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను లీటరుకు రూ.55.50కి పెంచారు. అదే విధంగా ఏవియేషన్ (టర్బైన్ ఫ్యూయల్ ఏటీఎఫ్) పై సుంకాన్ని లీటరుకు రూ.42గా నిర్ణయించారు. ఇంతకుముందు ఈ రేట్లు తక్కువగా ఉండగా, ఇప్పుడు భారీగా పెంచడం ద్వారా ఎగుమతులపై నియంత్రణ తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. పశ్చిమాసియా యుద్ధం కారణంగా మార్చి 26న కేంద్రం డీజిల్‌పై లీటరుకు రూ.21.50, ఏటీఎఫ్‌పై రూ.29.50 చొప్పున ఎగుమతి సుంకం విధించింది. అయితే పశ్చిమాసియా పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడం వల్ల కొత్తగా సుంకాలను పెంచాల్సిన అవసరం ఏర్పడింది. ఈ మార్పులు ఫైనాన్స్ యాక్ట్ 2002లోని ఎనిమిదో షెడ్యూల్‌లో సవరణల ద్వారా అమలు చేసినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

**చమురు ధరలు పెరగడంతో ఇంధన ధరలపై ఒత్తిడి పెరిగే అవకాశం**

ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరగడం వల్ల దేశీయంగా కూడా ఇంధన ధరలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో ఎగుమతిదారులు అంతర్జాతీయ ధరల వ్యత్యాసాన్ని ఉపయోగించుకుని అధిక లాభాలు పొందే అవకాశాన్ని ప్రభుత్వం గుర్తించింది. అందుకే విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను పెంచి, దేశీయ మార్కెట్లో సరఫరా నిలకడగా ఉండేలా చర్యలు తీసుకుంది.

**పెట్రోల్‌పై ఎగుమతి సుంకం యథాతథం సున్నా!**

ప్రభుత్వ వర్గాల ప్రకారం, ఈ నిర్ణయం ప్రధానంగా రెండు లక్ష్యాలతో తీసుకున్నారు. మొదటిది దేశీయంగా డీజిల్, ఏటీఎఫ్ సరఫరా తగ్గకుండా చూసుకోవడం. రెండోది గ్లోబల్ మార్కెట్ ధరల వ్యత్యాసాన్ని ఉపయోగించి ఎగుమతి దారులు అక్రమ ప్రయోజనాలు పొందుకుండా నిరోధించడం. ఇక పెట్రోల్‌పై ఎగుమతి సుంకం మాత్రం యథాతథంగా సున్నాగా కొనసాగుతోంది. అంటే పెట్రోల్ ఎగుమతులపై ఇప్పటికీ ఎలాంటి అదనపు పన్ను విధించలేదని తెలుస్తోంది. అయితే డీజిల్, ఏటీఎఫ్ వంటి కీలక ఇంధనాలపై మాత్రమే ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది.

**పశ్చిమాసియా సంక్షోభంతో**

పశ్చిమాసియాలో ఇటీవల జరిగిన పరిణామాలు ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థను కుదిపేశాయి. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై దాడులు చేపట్టాయి. అందుకు ప్రతిగా ఇరాన్ కూడా ప్రతిదాడులు చేసింది. ఈ నేపథ్యంలో యుద్ధ వాతావరణం తారా స్థాయికి చేరింది. ఫలితంగా హర్మూజ్ జలసంధి మూసివేయడంతో ముడి చమురు సరఫరా వ్యవస్థలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు పెరిగాయి. అయితే, పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు తీవ్ర రూపం దాల్చడంతో ఏప్రిల్ 8న అనూహ్య పరిణామం జరిగింది. యుద్ధానికి రెండు వారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లు అమెరికా, ఇరాన్ ప్రకటించాయి. అయినప్పటికీ పరిస్థితులు ఇంకా పూర్తిగా సాధారణ స్థితికి రాలేదు. అయితే, ఈ అనిశ్చితి కారణంగా భవిష్యత్తులో కూడా ఇంధన ధరలు మార్పులు చెందే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇలాంటి సమయంలో దేశీయంగా ఇంధన సరఫరా భద్రత చాలా ముఖ్యమని కేంద్రం భావిస్తోంది. అందుకే ఎగుమతులపై నియంత్రణ ద్వారా దేశంలో నిల్వలను పెంచి, అవసరమైన సరఫరాను నిర్ధారించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

# గ్లోబల్ స్టార్టప్ రేసులో భారత్ జోరు

# 'హెక్టాకార్న్'గా రిలయన్స్ రిటైల్ రికార్డు

## రిలయన్స్ రిటైల్ ఇప్పుడు ఒక హెక్టాకార్న్

## నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ 27వ స్థానం, టాటా ఈవీ మొబిలిటీ 93వ స్థానం




ప్రపంచంలోని అత్యంత విలువైన ప్రైవేట్ స్టార్టప్ కంపెనీల జాబితాలో రిలయన్స్ రిటైల్ 7వ స్థానాన్ని దక్కించుకుంది. స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ పరిశోధన ప్రకారం, ఈ సంస్థ 100 బిలియన్ డాలర్లకు పైగా విలువను సాధించి అంతర్జాతీయ స్థాయిలో కీలక మైలురాయిని అధిగమించింది. ప్రపంచవ్యాప్తంగా టాప్ 100 అత్యంత విలువైన స్టార్టప్‌ల జాబితాలో మూడు భారతీయ కంపెనీలకు చోటు లభించగా, అందులో రిలయన్స్ రిటైల్ అత్యున్నత ర్యాంకును సాధించి గ్లోబల్ మార్కెట్‌లో భారత్ బలమైన ఉనికిని చాటిచెప్పింది. రిలయన్స్ రిటైల్ 'పోస్ట్-మనీ వాల్యుయేషన్' 100 బిలియన్ డాలర్లను దాటింది. దీనితో ప్రపంచవ్యాప్తంగా 100 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువ కలిగిన ఏడు కంపెనీల గ్రూపులో (హెక్టాకార్న్స్) ఇదీ చేరింది. ఈ టాప్-7 కంపెనీల్లో రిటైల్ రంగానికి చెందిన ఏకైక సంస్థ రిలయన్స్ రిటైల్ కావడం విశేషం.

**పెట్టుబడిదారులు నిర్ణయించిన విలువ ఆధారంగానే ర్యాంకింగ్**

ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, కేకేఆర్, సిల్వర్ లేక్, జీఐసీ, టీపీజీ, ముబదాలా వంటి ప్రధాన గ్లోబల్ ఇన్వెస్టర్ల నుంచి ఈ సంస్థ పెట్టుబడులను పొందింది. ఈ పెట్టుబడిదారులు నిర్ణయించిన విలువ ఆధారంగానే ఈ ర్యాంకింగ్ ఖరారు చేశారు. స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వారి 'వెంచర్ క్యాపిటల్ ఇనిషియేటివ్' పరిశోధనలో భాగంగా, జనవరి 2026 వరకు ఉన్న గణాంకాల ఆధారంగా ఈ ర్యాంకులను ప్రకటించారు.

**ప్రపంచ పెట్టుబడి ధోరణుల్లో టెక్, ఏఐ కంపెనీల ఆధిపత్యం**

ఈ జాబితాలో మొదటి మూడు స్థానాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ 'ఓపెన్ ఏఐ', ఎలాన్ మస్క్‌కు చెందిన 'స్పేస్ ఎక్స్', 'ఆంత్రోపిక్' నిలిచాయి. ఇది ప్రపంచ పెట్టుబడి ధోరణుల్లో టెక్, ఏఐ కంపెనీల ఆధిపత్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఈ నివేదికలో మొత్తం మూడు భారతీయ కంపెనీలు ఉన్నాయి. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ 24 బిలియన్ డాలర్ల విలువతో 27వ స్థానంలో నిలవగా, టాటా ఈవీ మొబిలిటీ 9 బిలియన్ డాలర్ల విలువతో 93వ స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో 65 కంపెనీలతో అమెరికా అగ్రస్థానంలో ఉండగా, చైనా 21 కంపెనీలతో రెండో స్థానంలో ఉంది. భారత్, యునైటెడ్ కింగ్‌డమ్ చెరో మూడు కంపెనీలతో తదుపరి స్థానాల్లో ఉన్నాయి. మొదటి మూడు స్థానాల్లో ఉన్న ఓపెన్ ఏఐ, స్పేస్ ఎక్స్, ఆంత్రోపిక్ కంపెనీలే మొత్తం జాబితాలోని కంపెనీల విలువలో దాదాపు మూడో వంతు వాటాను కలిగి ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇది గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ రంగంపై ఏఐ రంగానికి ఉన్న పట్టును సూచిస్తోంది. అదే సమయంలో రిలయన్స్ రిటైల్ సాధించిన ఈ ర్యాంకింగ్ ప్రపంచ రిటైల్ మార్కెట్‌లో భారత్ ఎదుగుదలను నొక్కి చెబుతోంది.


# అప్పుడు లావణ్య.. ఇప్పుడు మృణాల్.. అల్లు అరవింద్ బ్లెస్సింగ్స్



స్టేజ్‌పై సరదాగా మాట్లాడే టాలీవుడ్ ప్రముఖుల్లో నిర్మాత అల్లు అరవింద్ ఒకరు. సినిమాకు సంబంధించిన ఈవెంట్లలో ఆయన స్పీచ్ ఎప్పుడూ నవ్వించేలా ఉంటుంది. అలాగే టాలెంట్ ఉన్న యువ నటీనటులను ప్రోత్సహించేలా ఆయన మాటలు ఉంటాయి. కొన్ని సందర్భాలలో వాళ్ల ప్రేమ విషయాలను కూడా బయటపెడుతుంటాడు. అయితే ఆయనకు తెలిసి అంటాడో తెలియక అంటాడో తెలియదు కానీ.. ఆయన నోటి నుంచి వచ్చిన మాటలు కొన్నిసార్లు నిజమవుతుంటాయి. ఓ సినిమా ఈవెంట్‌లో లావణ్య త్రిపాఠిని ఉద్దేశిస్తూ..'తెలుగు చక్కగా మాట్లాడుతున్నావు.కాబట్టి ఇక్కడ అబ్బాయినే పెళ్లి చేసుకుంటే బాగుంటుంది' అని దీవించగా..ఆయన మాటలే నిజమై.. వరుణ్ తేజ్‌ని పెళ్లి చేసుకుంది. ఇక తాజాగా ఆయన మరో నటిపై కూడా అలాంటి వ్యాఖ్యలే చేశాడు. సీతారామం ఫేం మృణాల్ ఠాకుర్‌ని కూడా తెలుగు అబ్బాయినే పెళ్లి చేసుకోమని సలహా ఇచ్చాడు. తాజాగా ఆయన అడివి శేష్-మృణాల్ జంటగా నటించిన 'డెకాయిట్' మూవీ సక్సెస్ మీట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మృణాల్ పెళ్లి గురించి ప్రస్తావిస్తూ.. లావణ్య మాదిరే నువ్వు కూడా తెలుగు అబ్బాయినే పెళ్లి చేసుకొని ఇక్కడే సెటిల్ అవ్వాలని కోరుకుంటున్నాను అని అన్నాడు. 'ఇంతకు ముందు ఒక అమ్మాయిని(లావణ్య త్రిపాఠి) దీవించాను. ఆమె మా వరుణ్ తేజ్ భార్య అయిపోయింది. అలాగే నువ్వు(మృణాల్) కూడా ఇక్కడ అబ్బాయినే పెళ్లి చేసుకోవాలని కోరుకుంటున్నాను. మీరు మాకు(టాలీవుడ్) కావాలి. అందుకే తెలుగు అబ్బాయిని పెళ్లి చేసుకోవాలని కోరుకుంటున్నా' అని అరవింద్ నవ్వుతూ అన్నాడు.


# యోధుడిలా అరవింద్ కృష్ణ

అరవింద్ కృష్ణ, చుంకీ పాండే, అర్చనా శాస్త్రి, ప్రిన్స్, దివి ప్రధాన పాత్రల్లో రాకీ షెర్మాన్ తెరకెక్కిస్తున్న చిత్రం 'కర్మస్థలం'. రాయ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం సాయి కార్తిక్ సంగీతాన్ని అందిస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక తాజాగా ఈ సినిమా నుంచి అరవింద్ కృష్ణ పాత్రకు సంబంధించిన లుక్‌ను, మేకింగ్ వీడియోని షేర్ చేశారు. అరవింద్ కృష్ణ ప్రస్తుతం సూపర్ హీరో పాత్రలతో ఆడియెన్స్‌ను ఆకట్టునేందుకు రెడీ అవుతన్నారు. ఇలాంటి టైంలో ఓ యోధుడిలా 'కర్మస్థలం'లో కనిపించబోతోన్నారు. తాజాగా ఆయన పాత్రకు సంబంధించిన లుక్, మేకింగ్ వీడియోని రిలీజ్ చేశారు. ఇక సెట్‌లోనే అరవింద్ కృష్ణ చేస్తున్న వర్కౌట్స్, రిహార్సల్స్ అన్నీ కూడా ఎంతో నేచురల్‌గా ఉన్నాయి. గుర్రపు స్వారీ కూడా ఈ చిత్రంలో హైలెట్ అయ్యేలా కనిపిస్తుంది. విజువల్స్, బీజీఎం ఈ సినిమాను అదనపు ఆకర్షణ అయ్యేలా ఉంది.



# నవ్వుని నటిస్తూ బతుకుతున్న ప్రతి మగాడి కథ

అడపాదడపా హీరోగా సినిమాలు చేసే తిరువీర్ నుంచి వస్తున్న లేటెస్ట్ మూవీ 'పాపం ప్రతాప్'. గతేడాది డిసెంబరులో 'ద గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' చిత్రంతో హిట్ కొట్టిన ఇతడు.. ఇప్పుడీ సినిమాతో ప్రేక్షకుల ముందుకొస్తున్నాడు. ఈ శుక్రవారమే థియేటర్లలోకి రానుండగా తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ఇది ఆకట్టుకునేలా ఉంది. 1998లో గోదావరిలో జరిగే కథగా దీన్ని చూపించారు. ప్రతాప్, బుజ్జమ్మని పెళ్లి చేసుకుంటాడు. కానీ మూడో రోజే ఆమె.. ప్రతాప్‌ని వదిలి వెళ్లిపోతుంది. తర్వాతరోజు పెద్ద మనుషుల దగ్గర పంచాయతీ పెడుతుంది. ఇంతకీ వీళ్లిద్దరి మధ్య ఏం జరిగింది? ప్రతాప్ ఏమైనా చేశాడా? ప్రతాప్‌కే ఏమైనా జరిగిందా అనేదే కాన్సెప్ట్‌లా అనిపిస్తుంది. 'ఒకమ్మాయి ఇల్లు వదిలి వెళ్లిందంటే అబ్బాయి ఏం చేశాడని అడుగుతారు. కానీ ఆ అబ్బాయికి ఏం జరిగిందని ఎవరూ అడగరు' అనే డైలాగ్ ఆసక్తికరంగా అనిపించింది. నవ్వుని నటిస్తూ బతుకుతున్న ప్రతి మగాడి కథ అని చివరో ఓ లైన్ వేశారు.





# 2030 దాకా నేనే నెంబర్‌వన్.. అల్లు అర్జున్ ఆలోచన అదేనా?

స్టార్స్ జీవితంలో ఒక భారీ విజయం దక్కడం సులభమే కావచ్చు... కానీ దానిని నిలబెట్టుకోవడం కొనసాగించడం మాత్రం అంత సులభం కాదు. టాలీవుడ్‌లో ప్రస్తుతం స్టార్ డమ్ అనేది చాలా అస్థిమితంగా మారింది. ఖచ్చితంగా నెంబర్ వన్ హీరో ఎవరు అంటే చెప్పలేని పరిస్థితి నెలకొంది. ప్రేక్షకులు ఒక్కో ఏడాది ఒక్కో హీరో చిత్రానికి పట్టం కడుతుండడంతో నెంబర్లాట దోబూచులాటగా మారుతోంది. ఈ పరిస్థితిలో ప్రస్తుతానికి మాత్రం ఇటు కలెక్షన్స్ పరంగా చూసినా అటు రెమ్యునరేషన్ పరంగా చూసినా, అల్లు అర్జున్ నెం1గా నిలుస్తున్నాడనేది నిర్వివాదం. తాజాగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తన చిత్రం 'రాకా' కోసం ఏకంగా రూ.300 కోట్ల వరకూ రెమ్యునరేషన్ తీసుకుని సమకాలీన హీరోల్లో ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు బన్నీ. ఎవరూ ఊహించని విధంగా అప్పటి వరకూ 5, 6 స్థానంలో ఉన్న స్టైలిష్ స్టార్ కాస్తా ఒక్క ఉదుటున నెం1 ఐకాన్ స్టార్‌గా చేసింది పుష్పరాజ్ పాత్ర. ప్రస్తుతం అల్లు అర్జున్ హవా నడుస్తున్నప్పటికీ ఇది వన్ సినిమా వండర్ అనీ త్వరలోనే మరో టాప్ హీరో నెం1 ఛెయిర్‌ని ఆక్రమిస్తాడని సినీ పండితుల్లో పలువురు భావిస్తున్నారు. మరోవైపు బన్నీ మాత్రం ఈ ఊహాగానాలను పటాపంచలు చేయాలని, తన స్టార్ డమ్‌ని మరింత పెంచే విధంగా పకడ్బందీ ప్రణాళికలు రచిస్తున్నట్టు కనిపిస్తోంది. కనీసం 2030 వరకూ తన ప్లేస్‌ని శాశ్వతం చేసుకునేలా తదుపరి ప్రాజెక్టులను ఆయన జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటున్నాడు. పుష్ప తర్వాత అల్లు అర్జున్ ఎంపికలు చూస్తే ఆ విషయం సులభంగా అర్ధమవుతుంది. జవాన్ లాంటి భారీ హిట్ ఇచ్చిన అట్లీని తన తదుపరి సినిమాకు ఎంపిక చేసుకోవడం ద్వారా తన భవిష్యత్తు ప్రయాణం ఎలా ఉండబోతోందో చెప్పకనే చెప్పాడు. ఆ తర్వాత దక్షిణాదిలో భారీ హిట్స్‌కి కేరాఫ్‌గా నిలిచిన లోకేష్ కనగరాజ్, అదే విధంగా మళయాళ పరిశ్రమకు చెందిన బాసిల్ జోసెఫ్‌లను ఐకాన్ స్టార్ జోడీ కట్టడానికి నిర్ణయించుకున్నట్టు సమాచారం. అంతేకాకుండా అల్లు అర్జున్ ప్రశాంత్ నీల్, సందీప్ రెడ్డి వంగా వంటి ప్రముఖ దర్శకులతో సైతం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. అందుతున్న సమాచారం ప్రకారం, అతని రాబోయే ప్రాజెక్ట్‌లతో ముడిపడి ఉన్న ఇతర పేర్లలో త్రివిక్రమ్ శ్రీనివాస్ కూడా ఉన్నారు. మొత్తంగా చూస్తే విభిన్నమైన జానర్‌ల మిశ్రమాన్ని అందించడం ద్వారా భారతీయ చిత్రసీమలో తనదైన హవాను ఆయన కొనసాగించాలని ఆలోచిస్తున్నట్టు అర్ధం అవుతుంది.




# యాంకర్ విష్ణుప్రియపై అసభ్య కంటెంట్ ఆరోపణలు..

## ఇలాంటి చర్యలకు పాల్పడడం సిగ్గుచేటు...

యాంకర్ విష్ణుప్రియ భీమినేని చుట్టూ సోషల్ మీడియాలో కొత్త వివాదం చెలరేగింది. ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అసభ్యకర కంటెంట్‌ను ప్రోత్సహిస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తడంతో, ఏఐఎస్ఎఫ్ నాయకులు పోలీసులను ఆశ్రయించారు. శనివారం విజయవాడలోని సూర్యారావుపేట సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఏఐఎస్ఎఫ్ నేతలు అధికారిక ఫిర్యాదు సమర్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. సాయికుమార్ నేతృత్వంలో ఈ ఫిర్యాదు ఇచ్చినట్లు సమాచారం.తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అర్ధనగ్న వీడియోలు వీక్షించాలంటే సభ్యత్వ రుసుము చెల్లించాలని విష్ణుప్రియ ప్రచారం చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ నేతలు ఆరోపించారు. టెలివిజన్ షోల ద్వారా మంచి గుర్తింపు పొందిన ఒక ప్రజాప్రతినిధి స్థాయి సెలబ్రిటీ, ఇలాంటి కంటెంట్‌ను ప్రోత్సహించడం యువతపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో ఆదర్శంగా ఉండాల్సిన వ్యక్తులు డబ్బు కోసం ఇలాంటి చర్యలకు పాల్పడటం సిగ్గుచేటని ఏఐఎస్ఎఫ్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. ఈ తరహా కంటెంట్ వల్ల సమాజంలో నైతిక విలువలు దెబ్బతింటాయని వారు పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఏఐఎస్ఎఫ్ నేతలు రెండు ప్రధాన డిమాండ్లు చేశారు. విష్ణుప్రియ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తక్షణమే నిలిపివేయాలి, అలానే ఐటీ చట్టం మరియు సంబంధిత సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి ఫిర్యాదు చేసిన సమయంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు దీపక్, సిద్దు, మనోజ్ సహా పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు. సమాజంలో ఇలాంటి ధోరణులను సహించబోమని, అవసరమైతే న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. సోషల్ మీడియా కంటెంట్‌పై బాధ్యత, నైతికత అంశాలు మరోసారి చర్చకు వచ్చాయి. ఈ వ్యవహారంపై పోలీసులు ఎలా స్పందిస్తారు? విష్ణుప్రియ నుంచి ఎలాంటి క్లారిటీ వస్తుంది? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# బాక్సాఫీస్ దగ్గర 'డెకాయిట్' దూకుడు.. అడివి శేష్ కెరీర్‌లోనే భారీ ఓపెనింగ్స్



టాలీవుడ్ హీరో అడివి శేష్ నటించిన తాజా చిత్రం డెకాయిట్ బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతోంది. విడుదలైన మొదటి రోజునుంచే మంచి టాక్ తెచ్చుకున్న ఈ సినిమా, రెండు రోజుల్లోనే భారీ వసూళ్లు సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. ఈ చిత్రం అడివి శేష్ కెరీర్‌లోనే అత్యుత్తమ ఓపెనింగ్స్ సాధించిన సినిమాగా నిలవడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా తొలి రెండు రోజుల్లోనే సుమారు రూ.28 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. మొదటి రోజు రూ.15 కోట్లు, రెండో రోజు రూ.13 కోట్లు రాబట్టడం ద్వారా ఈ సినిమా మంచి కలెక్షన్లను కొనసాగిస్తోంది. ఇక హిందీ వెర్షన్ కూడా ఆశించిన దానికంటే మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. మొదటి రోజు రూ.1.3 కోట్లు వసూలు చేసిన ఈ చిత్రం, రెండో రోజు రూ.1.75 కోట్లకు పెరగడం గమనార్హం. సాధారణంగా రెండో రోజు డ్రాప్ కనిపించే సందర్భాల్లో, ఈ సినిమా మాత్రం గ్రోత్ నమోదు చేయడం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అంతేకాదు, విదేశాల్లో కూడా 'డెకాయిట్' మంచి రన్ కొనసాగిస్తోంది. ముఖ్యంగా అమెరికా మార్కెట్‌లో బలమైన వసూళ్లు సాధిస్తూ, ఇప్పటికే వి1 మిలియన్ మార్క్‌ను దాటడం చిత్ర బృందానికి పెద్ద ప్లస్‌గా మారింది. ఎమోషనల్ ఫీల్ గుడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించింది. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ఇద్దరి నటన కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా శేష్ తన పాత్రలో చూపిన ఇంటెన్సిటీ, భావోద్వేగాలు సినిమాకు ప్రధాన బలం అయ్యాయి. సినిమా టేకింగ్, మేకింగ్ విలువలు, కథనం అన్నీ కలిసి ఈ చిత్రాన్ని మరింత బలంగా నిలబెట్టాయి. ప్రేక్షకుల నుంచి పాజిటివ్ టాక్ రావడంతో వీకెండ్‌లో కలెక్షన్లు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాతలు సుప్రియ యార్లగడ్డ, సునీల్ నారంగ్ నిర్మించారు. మంచి కంటెంట్‌తో పాటు బలమైన ప్రెజెంటేషన్‌తో వచ్చిన 'డెకాయిట్' సినిమా బాక్సాఫీస్ వద్ద మరో హిట్‌గా నిలిచే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ సినిమాకి పోటీగా శర్వానంద్ బైకర్ చిత్రం కూడా విడుదల కాగా, ఈ మూవీ కూడా పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com